

నేడు రేవుపోలవరం తీరంలో యోగా

- హాజరుకానున్న మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్

యోగాంధ్రలో కళాశాల విద్యార్థులు

- మూడు రోజులపాటు శిక్షణ -8లో

విశాఖలో యోగాకు 60 వేల మంది

జిల్లా నుంచి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర. పక్కన మంత్రులు అనిత, కందుల దుర్గేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయకృష్ణన్



హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు

- మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష
- జిల్లా నుంచి 825 బస్సులు: కలెక్టర్

అనకాపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి జిల్లా నుంచి 60 వేల మందిని తరలించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేశ్, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ వేదికగా సుమారు ఐదు లక్షల మందితో నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి తరలించే వారి కోసం రవాణా సదుపాయం, ఇతర ఏర్పాట్లు చేయాలని సూచించారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ, జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ, విశాఖలో నిర్వహించే యోగా దినోత్సవం కోసం నెల రోజుల నుంచి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, విశాఖకు ప్రజలను తరలించే క్రమంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు.

జిల్లా నుంచి 825 బస్సులు

కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి 825 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యార్థులను తీసుకెళ్లే బస్సుల్లో ప్రతి బస్సుకు ఇద్దరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. విద్యార్థులను విశాఖ తీసుకెళ్లి, కార్యక్రమం ముగిసిన తరువాత తిరిగి ఇళ్లకు చేర్చే బాధ్యత ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. అచ్యుతాపురం, పరవాడ పారిశ్రామిక ప్రాంతాల నుంచి 25 వేల మంది ఉద్యోగులు, కార్మికులను యోగా దినోత్సవానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, యోగా

... మిగతా 8వ పేజీలో

యోగాంధ్రకు 2 వేల సీసీ టీవీ కెమెరాలు

- ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు
- హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత
- వీఎంఆర్‌డీఏలో మంత్రులు, కూటమి నేతలు, అధికారులు సమావేశం

విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-భీమిలి బీచ్ రోడ్డులో ఈ నెల 21న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమం కోసం రెండు వేల సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. వీఎంఆర్‌డీఏలో ఆమె మంత్రులు అనగాని సత్యప్రసాద్, బాలవీరాంజనేయస్వామి, అచ్చెన్నాయుడు, జనార్దన్‌రెడ్డి, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. లక్షలాది మంది హాజరవుతున్నందున ట్రాఫిక్ సమస్యలు లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా కార్యక్రమం కొనసాగేలా చర్యలు చేపట్టామన్నారు. విశాఖ ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నర్సీపట్నం ఏఎంసీకి కొత్త పాలకవర్గం

- చైర్మన్‌గా గవిరెడ్డి వెంకటరమణ
- వైస్‌చైర్మన్‌గా కన్నయ్యనాయుడు
- మరో 13 మంది డైరెక్టర్లుగా నియామకం

నర్సీపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు గవిరెడ్డి వెంకటరమణ నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా పెదబొడ్డేపల్లికి చెందిన చిటికల కన్నయ్యనాయుడుతోపాటు డైరెక్టర్లను నియమిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సీపట్నం మునిసిపాలిటీలోని బలిఘట్టం గ్రామానికి చెందిన వెంకటరమణ ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పార్టీకి అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పదవి లభించినట్టు టీడీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం 20 మంది సభ్యులు వుండే ఏఎంసీ పాలకవర్గంలో స్థానిక శాసన సభ్యులు సీహెచ్ అయ్యన్నపాత్రుడు గౌరవ చైర్మన్‌గా వుంటారు. పాలకవర్గ సభ్యులుగా కర్రి మంగ, మజ్జి రాజేశ్వరి, పట్టెం రాజుబాబు, పెట్ల సంధ్య, రాయి పెదబాబులు, సాలాదుల దేవి, వబ్బలరెడ్డి సుబ్బలక్ష్మి, యాదగిరి సత్తిబాబు, యర్రంశెట్టి వెంకటరమణ, యక్కల కమలాంబిక, బి.హిమబిందు, నారపురెడ్డి బాలరాజు, వెలగా వెంకట కృష్ణారావుతోపాటు మునిసిపల్ చైర్‌పర్సన్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి, వ్యవసాయ శాఖ ఏడీ, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి వుంటారు. ఈ సందర్భంగా ఏఎంసీ నూతన చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ మాట్లాడుతూ, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచనలతో ఆయన ఆలోచనలకు అనుగుణంగా ఏఎంసీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రైతు బజార్ ప్రక్షాళనపై



గవిరెడ్డి వెంకటరమణ

... మిగతా 8వ పేజీలో

సాయి శ్రేయాస్‌కు షాక్

ఫార్మా కంపెనీలో ఉత్పత్తి నిలిపివేత

- ఏపీ పీసీబీ, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ వేర్వేరుగా ఉత్తర్వులు
- అన్నీ అడ్డగోలు పనులే
- భద్రత లేదు... శిక్షణ లేదు.. రికార్డులు లేవు
- ఈ నెల 12న విష వాయువులు విడుదల కావడంతో ఇద్దరు భద్రతా విభాగం అధికారులు మృతి



'సాయి శ్రేయాస్' ఫార్మా కంపెనీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పరవాడ ఫార్మా సిటీలోని సాయి శ్రేయాస్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీ మందుల తయారీలో నిబంధనలు ఉల్లంఘిస్తోంది. ఉద్యోగుల భద్రతను గాలికి వదిలేసింది. ఇద్దరి ప్రాణాలు పోయిన తరువాత ఇవన్నీ బయటకు రావడం గమనార్హం. అక్కడి అడ్డగోలు వ్యవహారాలు పరిశీలించిన అధికారులు తక్షణమే కంపెనీలో ఉత్పత్తులు నిలిపివేయాలని ఆదేశించారు.

సాయి శ్రేయాస్ (ఎస్ఎస్) ఫార్మా కంపెనీలో ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత 1.30 గంటల ప్రాంతంలో ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు పరిశీలనకు వెళ్లిన ఇద్దరు భద్రతా విభాగం అధికారులు ట్యాంకు మ్యాన్‌హోల్ నుంచి వచ్చిన హెచ్2ఎస్ వాయువు పీల్చి అక్కడికక్కడే మరణించిన సంగతి తెలిసిందే. మరో ఉద్యోగి స్పృహ కోల్పోగా కిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. ఎటోరికోక్సిబ్ అనే మందు తయారుచేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన తరువాత కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, డ్రగ్ కంట్రోల్ విభాగం, అగ్నిమాపక సిబ్బంది తదితరులు అక్కడకు వెళ్లి అన్నీ పరిశీలించారు. ఘటనా స్థలంలోనే ఉద్యోగులు ఇద్దరూ మరణించినట్టు తెలుసుకున్నారు. దీనిపై ఏ శాఖకు ఆ అధికారులు నివేదికలు సమర్పించారు. వాటిని పరిశీలించిన ఉన్నతాధికారులు తక్షణమే ఆ కంపెనీలో అన్ని రకాల ఉత్పత్తులు నిలిపివేయాలని ఏపీ పీసీబీ, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు.

నివేదికలో పేర్కొన్న లోపాలు

- సాయి శ్రేయాస్ కంపెనీ బల్క్ డ్రగ్, ఇంటర్మీడియట్ మందులు తయారు చేస్తుంది. రెండు ఉత్పత్తి విభాగాలు ఉన్నాయి. ఎటోరికోక్సిబ్ అనే మందు తయారీ మూడో దశలో ప్రమాదం జరిగింది.
- కంపెనీలో ఉత్పత్తి చేసే మందులు, వాటి నుంచి దశల వారీగా వెలువడే వ్యర్థాలు, వాటిని బయటకు తరలించే విధానంపై ఎక్కడా ఎటువంటి రికార్డులు నిర్వహించడం లేదు.
- ఉద్యోగుల నియామకం, వారికి అవసరమైన శిక్షణ, మందుల తయారీలో తీసుకోవలసిన భద్రతపై అవగాహన కల్పించడం వంటివి అక్కడ అమలు చేయడం లేదు.
- మందులను అర్హత పొందిన నిపుణుల పర్యవేక్షణలో తయారుచేయాలి. కానీ అక్కడ అలా చేయడం లేదు. అర్హత లేనివారే అన్ని

... మిగతా 8వ పేజీలో

బాబోయ్ బీఎన్ రోడ్డు!

- అడుగడుగునా గోతులతో జనం బెంబేలు
- ప్రమాదకరంగా మారిన ప్రయాణం
- పాడైపోతున్న వాహనాలు
- గత ప్రభుత్వ పాలకుల నిర్వాకంతో జనం పాట్లు
- ఏడాది దాటినా స్పందించని కూటమి ప్రభుత్వం

జిల్లాలో ప్రధాన రహదారుల్లో ఒకటైన భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు చోడవరం నియోజకవర్గం పరిధిలో అత్యంత దారుణంగా తయారైంది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డు నిర్వహణ, అభివృద్ధి విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఈ రోడ్డు అభివృద్ధి విషయంలో ఎటువంటి కదలిక లేదు.

-వార్త, మరిన్ని ఫొటోలు 8వ పేజీలో



చోడవరంలో కొత్తూరు జంక్షన్ వద్ద చెరువును తలపిస్తున్న భారీ గొయ్యి

రాయిపాడులో వైరల్ జ్వరాలు

ప్రతి ఇంటిలో ఒకరిద్దరు బాధితులు

గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గిరిజనుల వినతి



జ్వరంతో బాధపడుతున్న గెమ్మిలి అనిత, చిక్కిలి అంజలి, గెమ్మిలి చిలకమ్మ, గెమ్మిలి గంగ, సీదిరి ఎరుకునాయుడు

రావికమతం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు రాయిపాడు గిరిజన గ్రామంలో వైరల్ జ్వరాలు విజృంభించాయి. వాతావరణంలో మార్పులు, వర్షాలు కురుస్తుండడంతోపాటు తాగునీటి వనరులు కలుషితం కావడంతో ప్రతి ఇంటిలో ఒకరిద్దరు జ్వరాలబారిన పడ్డారు. గ్రామంలో మొత్తం 80 మంది జనభా వుండగా గెమ్మిలి అనిత, చిక్కిలి అంజలి, గెమ్మిలి గంగ, గెమ్మిలి చిలకమ్మ, సీదిరి ఎరికినాయుడు, పాంగి రామారావు, తదితరులు తీవ్రజ్వరంతో బాధపడుతున్నారు. ఏఎన్ఎం వచ్చి మందులు ఇచ్చినప్పటికీ జ్వరాలు తగ్గలేదు. ఓపికతోపాటు స్థోమత ఉన్న వారు కొత్తకోటలో ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. మిగిలిన వార ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. అయినప్పటికీ జ్వరాలు తగ్గడంలేదని బాధితులు వాపోతున్నారు. జ్వరంతోపాటు కాళ్లు, చేతులు పట్టేస్తున్నాయని, మంచంలో నుంచి లేచే ఓపిక కూడా ఉండడంలేదని చెబుతున్నారు. తక్షణమే గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా కొండ శిఖరంపై ఉన్న చలిసింగం గ్రామంలో కూడా సుమారు 30 మంది జ్వరాలతో బాధపడుతున్నట్టు తెలిసింది. వీరిలో కొంతమంది నర్సీపట్నంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లినట్టు గ్రామస్థులు తెలిపారు.

తురువోలులో కాల్పుల కలకలం

- అన్నను నాటుతుపాకీతో కాల్చిచంపిన తమ్ముడు
- గ్రామంలో ఒడ్డు పండుగ సందర్భంగా ఇద్దరి మధ్య స్వల్ప గొడవ
- క్షణికావేశంలో అన్న ప్రాణాలు తీసిన సోదరుడు



తమ్ముడి చేతిలో హత్యకు గురైన జోగ రాము

చీడికాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురువోలు గ్రామంలో తుపాకీ కాల్పులు కలకలం రేపాయి. ఒడ్డు పండుగ సందర్భంగా సోదరుల మధ్య తలెత్తిన చిన్నపాటి గొడవ, హత్యకు దారితీసింది. తమ్ముడు క్షణికావేశంలో సొంత అన్నను నాటు తుపాకీతో కాల్చిచంపాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. చీడికాడ మండలం తురువోలు గ్రామంలో మంగళవారం ఉదయం బొడ్డువారి కుటుంబీకు ఆధ్వర్యంలో ఒడ్డు పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా అందరితోపాటు అన్నదమ్ములైన జోగ రాము, జోగ దేముళ్లు కూడా మద్యం సేవించారు. ఈ క్రమంలో ఆవు పెయ్యి, తల్లి దగ్గర పాలు తాగుతుండగా తమ్ముడు దేముళ్లు దానిని అదిలించాడు. ఆవు పెయ్యిని ఎందుకు అదిలించావంటూ అన్న రాము మందలించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపం పట్టలేని

... మిగతా 8వ పేజీలో

ఫార్మా వ్యర్థాల కాలుష్యంతో మత్స్య సంపదకు ముప్పు

- పూడిమడక ఉప్పుటేరులో చనిపోయిన చేపలు
- మత్స్యకారుల ఫిర్యాదుతో పరిశీలించిన పీసీబీ అధికారులు



ఉప్పుటేరులో చనిపోయిన చేపలను పరిశీలిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సూర్యకళ, మత్స్యకార నాయకులు

అచ్యుతాపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) లోని ఫార్మా కంపెనీల నుంచి విడుదల చేసిన రసాయన వ్యర్థాల కారణంగా పూడిమడక ఉప్పుటేరులో చేపలు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడ్డాయి. మత్స్యకారులు ఈ విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫోన్ చేసి తెలియజేశారు. పీసీబీ ఏఈ సూర్యకళ వచ్చి పరిశీలించారు. పూడిమడక ఉప్పుటేరులో భారీగా చేపలు చనిపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

పూడిమడక లైట్‌హౌస్ దాటిన తర్వాత ఏటిమొగ (పొగిరి) నుంచి ప్రారంభమైన ఉప్పుటేరు.. పూడిమడక గ్రామం చుట్టూ తిరిగి కడపాలెం వద్ద సముద్రంలో కలుస్తుంది. సముద్రం నీటితోపాటు చేపలు కూడా ఉప్పుటేరులోకి వస్తుంటాయి. పలువురు మత్స్యకారులు రోజూ ఈ ఉప్పుటేరులో చేపల వేట సాగిస్తుంటారు. కాగా మంగళవారం ఉదయం భారీ స్థాయిలో చేపలు చనిపోయి నీటిపైన తేలాయి. దీంతో మత్స్యకారులు ఆందోళన చెంది, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. పీసీబీ ఏఈ సూర్యకళ మంగళవారం సాయంత్రం ఇక్కడకు వచ్చి ఉప్పుటేరును పరిశీలించారు. నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు

... మిగతా 8వ పేజీలో

సరుగుడు సాగుకు మొగ్గు

ఏటేటా పెరుగుతున్న విస్తీర్ణం

- వరి, చెరకు సాగు భారంగా మారడమే కారణం
- ప్రత్యామ్నాయ పంటలవైపు రైతుల చూపు

రావికమతం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):

వరి, చెరకు పంటల సాగు ఖర్చులు, పెట్టుబడి పెరిగిపోవడంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న అరకొర మద్దతు ధరలు గిట్టుబాటు కావడం లేదంటూ పలువురు రైతులు సరుగుడు తోటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. వీరిలో ఎక్కువ మంది గత సీజన్ వరకు చెరకు సాగు చేసిన రైతులే వున్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా నుంచి పేమెంట్ల వరకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, వచ్చే సీజన్‌లో చెరకు క్రషింగ్ జరుగుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొనడంతో సరుగుడు నాట్లు వేస్తున్నట్టు చెబుతున్నారు.



కవ్వగుంటలో సరుగుడు నాట్లు వేస్తున్న రైతులు



తట్టబందలో సరుగుడు నారు నర్సరీ

కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సరుగుడు మొక్కలు నాటుతున్నారు. పెద్దగా పెట్టుబడి అవసరం లేకపోవడం, నికరంగా ఆదాయం వచ్చేఅవకాశం వుండడంతో వరి, చెరకు సాగు చేసిన భూముల్లో సరుగుడు వేస్తున్నట్టు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో వరి సాగుకు రూ.30-35 వేలు, చెరకు సాగుకు రూ.50-60 వేలు పెట్టుబడి అవుతున్నది. దీనికితోడు కూలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకుంటే కొన్నిసార్లు పెట్టుబడి కూడా రావడంలేదు. కుటుంబ సభ్యుల శ్రమపాటు కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. అదే సరుగుడు (రకాన్నిబట్టి) సాగు చేసుకుంటే ఎకరాకు ఐదేళ్లపాటు గరిష్ఠంగా రూ.40 వేలు పెట్టుబడి అవుతుంది. ఎకరాకు గరిష్ఠంగా 60-70 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం పేపర్ మిల్లులు టన్ను రూ.6-7 వేలకు కొనుగోలు చేస్తున్నాయి. ఐదేళ్లకు ఖర్చులుపోను రూ.4 లక్షల వరకు మిగులుతాయి. ఏటా ఎకరాకు సగటున రూ.80 వేలు ఆదాయం వస్తుంది. నాలుగైదేళ్ల క్రితం వేసిన సరుగుడు తోటలు ప్రస్తుతం కోతకు రావడం, ఆయా

... మిగతా 8వ పేజీలో

ఇళ్ల మధ్య మురుగు నీరు

- నెలల తరబడి నిల్వ... ▸ దోమలు స్వైరవిహారం
- దుర్వాసనతో పెదిరెడ్డి సన్యాసిరావునగర్ వాసుల ఇబ్బంది
- పూడిక, చెత్త తొలగించక అధ్వానంగా నేరెళ్ల కాలువ

పాయకరావుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని పెదిరెడ్డి సన్యాసిరావునగర్‌లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నెలల తరబడి నీరు నిలిచి ఉండడంతో దోమలు, దుర్వాసనతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం గుండా వెళుతున్న నేరెళ్ల కాలువకు చేరుతున్న వర్షపునీరు మురికినీటితో కలిసి ఖాళీ స్థలాల్లోకి చేరి చెరువులను తలపిస్తున్నాయి.

పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ లేని పలు కాలనీల్లో ఇళ్ల మధ్య మురికినీటి నిల్వలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం మధ్యలో ప్రవహిస్తున్న నేరెళ్ల పంట కాలువ ద్వారా పూర్వం శివారులో వంద ఎకరాలకు సాగునీరందేది. తర్వాత కాలంలో వ్యవసాయ భూములు చాలావరకు లేఅవుట్లుగా మారాయి. దీంతో నేరెళ్ల పంట కాలువను ఇరిగేషన్ అధికారులు, రైతులు పట్టించుకోవడం మానేశారు. ఫలితంగా నేరెళ్ల కాలువకు పట్టణంలోని



నేరెళ్ల కాలువలో పేరుకుపోయిన చెత్త, తుప్పలు



పెదిరెడ్డి సన్యాసిరావునగర్ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురికినీరు

ప్రధాన డ్రైనేజీలతోపాటు పలు కాలనీల్లో మురికి కాలువల అవుట్‌లెట్లు ఏర్పాటుచేయడంతో అది మురికి కాలువగా మారింది. ఈ కాలువలో పేరుకుపోతున్న పూడిక, తుప్పలు, చెత్తను పంచాయతీ అధికారులు తొలగించడం లేదు. దీంతో కాలువలో మురికినీరు ప్రవహించే అవకాశం లేక పట్టణంలోని శ్రీలక్ష్మి థియేటర్ వెనుక ఉన్న పెదిరెడ్డి సన్యాసిరావునగర్ కాలనీలోని లోతట్టు ప్రాంతంలోని ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లోకి చేరుతున్నది. ఆయా ప్రాంతాల్లో నెలల తరబడి నీరు నిల్వ ఉండడంతో మురికికూపాలుగా మారుతున్నాయి. ఈ కాలనీలో దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతున్నది. అలాగే మురుగునీరు నిల్వ ఉండడంతో విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. ఈ కంపును కాలనీ వాసులు భరించలేకపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పట్టణంలో నేరెళ్ల కాలువలో పేరుకుపోయిన పూడిక, చెత్త, తుప్పలు తొలగించడంతోపాటు ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లోని మురికినీటిని బయటకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కొక్కిరాపల్లి యువత సేవలు అభినందనీయం

- మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని కొక్కిరాపల్లి వార్డులో గ్రామజ్యోతి యువత పేరుతో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. మంగళవారం ఆమె కొక్కిరాపల్లిలో పర్యటించి నూకాంబిక చెరువు వద్ద గ్రామజ్యోతి యువత నాటిన మొక్కలను ఆమె పరిశీలించారు. స్వామి వివేకానంద స్ఫూర్తిగా చేసుకుని గ్రామానికి చెందిన యువతీ, యువకులు పెద్దల సూచనలు, సలహాలు తీసుకొని గ్రామంలో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని స్థానిక యువ కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ చైర్‌పర్సన్‌కు వివరించారు. ప్రతి ఆదివారం గ్రామజ్యోతి యువత అంతా కలిసి గ్రామ వీధుల్లో ఉన్న చెత్తను తొలగించడం, రోడ్ల గోతులను పూడ్చడం, మొక్కలు నాటడం వాటి నిర్వహణ చూడడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు కొన్ని వారాలుగా చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గ్రామజ్యోతి యువతను అభినందించారు. యువతను ప్రోత్సహించేందుకు తమ వంతుగా చెరువు గట్టు వద్ద 100 కొబ్బరి మొక్కలు, గ్రాస్ కట్టర్ తమ వంతు అందిస్తామని ఆమె ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.



కొక్కిరాపల్లిలో యువతతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రమాకుమారి

రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగపర్చుకోవాలి

- టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్

నక్కపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగపర్చుకోవాలని టీడీపీ నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ సూచించారు. మంగళవారం గుల్లిపాడు, దోసలపాడు గ్రామాల్లో ఏవో ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్ మాట్లాడుతూ చాలా కాలం తరువాత రాష్ట్రంలో రైతులకు 50శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం ఇస్తోందన్నారు. అర్హత వున్న రైతుకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌తో కలిపి రూ. 20వేలు అందున్నాయని చెప్పారు. ఏవో ఉమాప్రసాద్ వరి విత్తన శుద్ధి, కుళ్లు తెగులు, అగ్గి తెగుళ్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, సూరిబాబు, కూటమి నాయకులు గంట్యాడ రమేశ్, వర ప్రసాద్, రాజేశ్, సోము, సత్యనారాయణ, వెంకటరమణ, చిట్టిబాబు, ఏఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లి: రైతులకు సబ్సిడీపై పనిముట్లు అందజేస్తున్న వెంకటేశ్,తదితరులు

రాంబిల్లిలో..

మండలంలోని రాంబిల్లి, కొప్పుగొండుపాలెంల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అనకాపల్లి జిల్లా జలవనరుల కేంద్రం ఏవో పి.విజేత మాట్లాడుతూ కొబ్బరి, జీడి తోటల్లో మొక్కకు 50 గ్రాములు చొప్పున జింక్, బోరాన్ వేయడం ద్వారా పూత, పిందె రాలడాన్ని అరికట్టవచ్చునన్నారు. కొబ్బరి తోటలు మధ్య పీఎండీఎస్ కిట్టు వేయడంతో భూసారం పెరగడమే కాకుండా అపరాలు, నువ్వులు వంటి పంటలు సాగు చేయడం ద్వారా అదనంగా దిగుబడి వస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత మాట్లాడుతూ వరి విత్తనాలు తీసుకువెళ్లే రైతులు తప్పనిసరిగా సూడోమోనాస్ విత్తనశుద్ధి మందును తీసుకువెళ్లాలన్నారు. ఈ మందును విత్తనాలలో కలుపుకొని వేసుకోబోయే 24 గంటల ముందు బస్తాలో వేసి ఆ తరువాత నారుమడిలో వేసుకుంటే తెగుళ్లను చాలా వరకు అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, కుమారి, పైడికొండ, వీపీఏ కోటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని నామవరం, పీఎల్.పురం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఆదినారాయణ ఆయాగ్రామాల్లో భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖరీఫ్‌లో అధిక దిగుబడులు లక్ష్యంగా భూసారం పెంపుదల, నాణ్యమైన విత్తనాల వినియోగం తదితర అంశాలపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి ఎన్‌పీఎస్ఎస్ యాప్, పీఎండీఎస్ కిట్స్‌పై అవగాహన కల్పించారు. అదేవిధంగా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల ప్రజాప్రతినిధులు, రైతులు, ఎఫ్‌పీఓ సత్యనారాయణ, ఎంపీఈఓ శ్రావణ్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

మండలంలోని ఏటికొప్పాక, బయ్యవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మోహనరావు అన్నదాత సుఖీభవ విధి విధానాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రీనా, సుగంధి, రైతులు పాల్గొన్నారు.



రాంబిల్లి: రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వనరుల కేంద్రం ఏవో విజేత



పాయకరావుపేటరూరల్: రైతులకు సలహాలిస్తున్న ఏఓ ఆదినారాయణ

ముగిసిన ఆరో ఆంధ్రా ఎన్‌సీసీ నేవెల్ శిక్షణ

పాయకరావుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆరో ఆంధ్రా ఎన్‌సీసీ నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో నూరంపాలెంలో ఈనెల 8 నుంచి 17వ తేదీ వరకు జరిగిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు సత్తా చాటారు. శ్రీప్రకాశ్ విద్యా సంస్థల విద్యార్థులు ఎల్. సాయి, భువనేష్, డి. కృష్ణ సాయితేజ, బి. నరసింహ, కె. కవివర్ధన్, ఎ. చంద్రశేఖర్, టి. రామ్ మణికంఠ చక్కని ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలవడంతోపాటు బంగారు పతకాలు సాధించినట్టు మంగళవారం శ్రీ ప్రకాష్ యాజమాన్యం తెలిపింది. క్యాంప్ కమాండెంట్ కల్నల్ అజయ్ యాదవ్, గ్రూపు కమాండర్ రితిన్ మోహన్ అగర్వాల్, ఎస్ఎం గోవింద్‌రావు నాయకత్వంలో నిర్వహించిన ఈ శిబిరంలో 10 జూనియర్ డివిన్, జూనియర్ వింగ్, 7 సీనియర్ డివిజన్, సీనియర్ వింగ్‌లకు చెందిన 478 మంది పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్ వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

'పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు'

ఎస్.రాయవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో తల్లికి వందనం పథకంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించారని తెలుగు యువత మండల అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఉన్నత విద్యలో రాణించే విధంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కలిగట్ల రత్నం, ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, మాజీ ఉప సర్పంచ్ సియ్యాదుల అచ్యుత్‌కుమార్, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు బండి నాగేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ నగిరెడ్డి ఆదినారాయణ, పాల సంఘం అధ్యక్షుడు గేదెల నాయుడు పాల్గొన్నారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

యోగాంధ్ర పోటీల్లో సత్తాచాటిన పిల్లలు

- రాష్ట్ర స్థాయి పెయింటింగ్‌లో ప్రథమ బహుమతి
- పోస్టర్ మేకింగ్‌లో రెండో స్థానం



జీ క్షితిజ పి. భవిత

ఎస్.రాయవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఎస్.రాయవరం మండలానికి చెందిన ఇద్దరు బాలికలు సత్తా చాటారు. అడ్డరోడ్డుకు చెందిన టెన్త్ చదువుతున్న జీ క్షితిజ యోగాంధ్ర పెయింటింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్టు ఆయుష్ ఆస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే దార్లపూడికి చెందిన పినపోలు భవిత పోస్టర్ మేకింగ్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందిన ఇద్దరు బాలికలను అధికారులు అభినందించారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి 'తల్లికి వందనం' అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

ఎలమంచిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో ఔట్ సోర్సింగ్ విధులు నిర్వర్తిస్తున్న వారందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని కోరుతూ మంగళవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ మునిసిపాలిటీల్లో ఔట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న వారికి తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న వారందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో వినతిపత్రాన్ని కమిషనర్ ప్రసాదరాజుకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సూరిబాబు, సోంబాబు, కన్నాజీలు పాల్గొన్నారు.

పార్టీలు మారడం సర్వసాధారణం

- వైసీపీ మండల అధ్యక్షుడు శంకరరావు

అచ్యుతాపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి మారడం సర్వసాధారణమని వైసీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైసీపీ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో వైసీపీ నుంచి భారీ స్థాయిలో కూటమి పార్టీల్లోకి వలసలు జరుగుతున్నట్టు పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. అధికార పార్టీలోకి వలసలు సర్వ సాధారణమన్నారు. స్వలాభం కోసం కొంతమంది పార్టీలు మారుతుంటారని, నాయకులను తయారు చేయడం వైసీపీకి కొత్త కాదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మారిశెట్టి సూర్యనారాయణ, కోన బుజ్జి, లాలం రాంబాబు, నర్మాల కుమార్, కూండ్రపు వెంకునాయుడు, ఉమ్మిడి అప్పారావు. శనివాడ జువ్వాల నాయుడు, వాసుపల్లి శ్రీనివాసరావు, భీముని నాగేశ్వరరావు, పంచదార్ల పైడిరాజు, వియ్యపు కృష్ణ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు



చినదొడ్డిగల్లు హైస్కూల్ విద్యార్థులతో మానవహారం

నక్కపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు ఊపందుకున్నాయి. మంగళవారం చినదొడ్డిగల్లు హైస్కూల్ విద్యార్థులతో హెచ్ఎం బాలాజీ, ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు వైవీ రమణ, ఉపాధ్యాయులు ప్రసాద్, సాంబశివ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌వీఎస్ ఆచార్యులు ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. నక్కపల్లి జూనియర్ కళాశాలలో యోగా గురువు దవరసింగి రాంబాబు 100 మంది పిల్లలకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.

యోగా సాధనతో ఆరోగ్యం

- ఫర్ యు ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు రత్నప్రభ



యోగా గురువు రత్నప్రభను సత్కరించిన నాగులాపల్లి పిరమిడ్ కేంద్రం నిర్వాహకురాలు సుజాత తదితరులు

మునగపాక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగా సాధన ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందని ఫర్ యు ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు కొణతాల రత్నప్రభ అన్నారు. మండలంలో నాగులాపల్లి చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం యోగా శిక్షణకార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యోగా గురువులు రత్నప్రభ, జగన్ ధ్యాన సభ్యులకు పలు రకాల ఆసనాలు వేయించి శిక్షణ, అవగాహన కల్పించారు. ఈ అనంతరం యోగా గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పిరమిడ్ కేంద్రం నిర్వాహకురాలు పి.సుజాత పాల్గొన్నారు.

రాంబిల్లిలో మూతపడిన హోమియో వైద్యశాల

రాంబిల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : హోమియో వైద్యంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తుండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. రాంబిల్లి పీహెచ్‌సీలో ఆవరణలో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసి హోమియో వైద్యశాల మూడపడింది. ఈ వైద్యశాలలో హోమియో వైద్యులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రాంబిల్లి మండల పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో రోగులు హోమియో వైద్యానికి అలవాటు పడ్డారు. ఇక్కడ సేవలు అందకపోవడంతో రోగులు ఎలమంచిలి, అనకాపల్లి, గాజువాక, విశాఖపట్నం పట్టణాలకు వెళ్లి హోమియో వైద్యం చేయించుకుంటున్నారు. రాంబిల్లిలో హోమియో వైద్యం అందుబాటులో ఉంటే ఎటువంటి ఇబ్బందులు ఉండేవికావని, ఆసుపత్రిని మూసివేయడంతో ఇబ్బంది పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి మూసివేసిన హోమియో ఆసుపత్రిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మంత్రి జనార్దన్‌రెడ్డిని కలిసిన ప్రగడ



మంత్రి జనార్దన్ రెడ్డికి పుష్పగుచ్ఛాన్నిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మంగళవారం విశాఖపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో జరుగుతున్న రహదారుల నిర్మాణాలపై చర్చించామని ప్రగడ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అచ్యుతాపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీఓ కె. ప్రభాకరరావు తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతోపాటు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆర్థిక సంఘం రెండో విడత నిధులు విడుదల చేయాలి

మునగపాక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు వెంటనే 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం ఐదు నెలల క్రితం 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు మంజూరు చేసిందన్నారు. నిధులు లేక గ్రామ పంచాయతీల్లో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.బ్రహ్మాజీ, కాండ్రేగుల రాము తదితరులు పాల్గొన్నారు.

కాలువలను శుభ్రం చేయించాలి



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

రాంబిల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారాయుడుపాలెంలో కాలువలను శుభ్రం చేయించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ మంగతాయారు డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో ఆమె పలువురు మహిళా నేతలతో కలిసి ఆ గ్రామంలో అధ్వానంగా ఉన్న కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని కాలువలు పూడికతో నిండిపోయాయని, మురుగు నీరు పారక దుర్వాసన వస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి వెంటనే కాలువల్లోని పూడికను తొలగించాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక సచివాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఐద్వా మహిళా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ



విద్యార్థులకు కాపర్ వాటర్ బాటిళ్లను అందజేస్తున్న లాలంకోడూరు మాజీ సర్పంచ్ లాలం రమేష్‌నాయుడు

రాంబిల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ లాలం రమేష్‌నాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు లాలం చందు తల్లి సరోజిని జన్మదినం పురస్కరించుకొని మంగళవారం మండలంలోని లాలంకోడూరు హైస్కూల్‌లో 200 మంది విద్యార్థులకు కాపర్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లాలం రమేష్‌నాయుడు మాట్లాడుతూ తన తల్లి సరోజిని పుట్టిన రోజును తాము చదువుకున్న హైస్కూల్లో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బోళెం రాంబాబు, లాలం అభిరామ్, వార్డు సభ్యులు కసిరెడ్డి భాస్కరరావు, గూనూరు నాయుడు, రుత్తల శ్రీను, గిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాలయం వద్ద వైసీపీ ధర్నా



ఏఈఓకి వినతిపత్రం అందజేస్తున్న బొడ్డేడ ప్రసాద్, తదితరులు

మునగపాక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల వ్యవసాయ కేంద్రం వద్ద రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు సరఫరా చేయాలని కోరుతూ మంగళవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ రైతుకు కేవలం ఒక బస్తా అందజేస్తున్నారని, రెండు మూడు ఎకరాలు భూమికి ఎలా సరిపోతుందన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు కనిపిస్తోందన్నారు. అనంతరం వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కాండ్రేగుల నూకరాజు, దాసరి అప్పారావు, దొడ్డి బుజ్జి, నరాలశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలమంచిలిలో జనవాణి

ఎలమంచిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలోని జిల్లా పరిషత్ అతిథిగృహం ఆవరణలో బుధవారం ఉదయం నుంచి 9 గంటల నుంచి జనవాణి కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే విజయకుమార్ ప్రజల నుంచి వినతలు స్వీకరించనున్నారని కార్యాలయ అధికారి తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ సమస్యలను వినతుల రూపంలో ఎమ్మెల్యేకు అందజేయాలని తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న ముగ్గురి అరెస్టు

అచ్యుతాపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు సీఐ నమ్మి గణేష్ తెలిపారు. ఎర్రవరం శివారు కొండ ప్రాంతంలో కోడి పందేలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఆ సమయంలో ముగ్గురు వ్యక్తులతోపాటు రెండు కోళ్లు, రూ.450 స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

పరవాడపాలెం ఎన్టీఆర్ కాలనీలో సమస్యల రాజ్యం

మూడు వీధుల్లోనూ రోడ్లపై పారుతున్న మురుగు
కాలువలు లేక రహదారులపై మురికి నీటి ప్రవాహం
చీకటి పడితే దోమల స్వైరవిహారంతో వ్యాధుల భయం
గ్రామస్థులు అగచాట్లు.. పట్టించుకోని అధికారులు

కశింకోట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరవాడపాలెం పంచాయతీలో ఉన్న ఎన్టీఆర్ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కాలనీలోని మూడు వీధుల్లోనూ కనీస సదుపాయాలు కొరవడ్డాయి. రహదారులు అస్తవ్యస్తంగా తయారు కావడం.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై మురుగు నీరు ప్రవహించడం.. దోమలు స్వైరవిహారం చేస్తుండడం.. వెరసి కాలనీ వాసులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. చీకటి పడితే దోమలు దండయాత్ర చేస్తుండడం నిద్రకు దూరమవుతున్నారు.

ఎన్టీఆర్ కాలనీలో సుమారు 200 గృహాలు ఉన్నాయి. కాలనీలో రోజు రోజుకూ మురుగునీటి సమస్య పెరుగుతుందే తప్ప పరిష్కరించే నాథులే లేకపోతున్నారు. కాలువలకు మురుగునీరు సక్రమంగా నిర్వహణ జరిగేందుకు వీలు లేకుండా ఇష్టానుసారంగా ఇళ్ల నిర్మించుకున్నారు. కాలువలను


కాలువలో పేరుకుపోయిన మురికి నీరు


ఎన్టీఆర్ కాలనీలోని గృహాల మధ్యలోనే రోడ్డుపై నిలిచిన నీరు

సైతం కబ్జా చేసి నిర్మాణం చేయడం వల్ల మురుగు నీరు రహదారులపైనే మురుగు నీరు ఏరులై పారుతోంది. వర్షం పడితే మురుగునీటితో వర్షపు నీరు కలిసి అక్కడక్కడ నిలిపోతున్నది. దీంతో రాకపోలకులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మురుగు సమస్యతో అనారోగ్యాల బారిన పడుతున్నామని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వారు వేడుకుంటున్నారు.


గతుకులతో అస్తవ్యస్తంగా తయారైన కాలనీ ప్రధాన రహదారి

కాలనీలోకాలువల నిర్మాణం చేపట్టాలి



-గొంతిన నర్సయ్యమ్మ, గృహిణి, ఎన్టీఆర్ కాలనీ

కాలనీలో కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైనే తిష్ఠ వేస్తున్నది. తక్షణమే కాలువలు నిర్మించాలి. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లి గ్రామస్థుల ఆరోగ్యాలను కాపాడాలి.

ఇంకుడు గొయ్యిలను తీసుకున్నా ఫలితం లేదు



-కె.అమ్మాజీ, ఎన్టీఆర్ కాలనీ, పరవాడపాలెం

కాలనీలో వాడుక నీరు పోయేందుకు ఇంటి ముందు ఇంకుడు గొయ్యి నిర్మించుకున్నాం. అయినప్పటికీ ఏమాత్రం ఫలితం లేకుండా పోయింది. కాలువలు నిర్మిస్తే గ్రామంలో దోమల బెడద, దుర్వాసన ఉండదు. వీధిలో మురుగు నీరు నిల్వ లేకుండా ప్రతి రోజూ పరిశుభ్రం చేయాలి.


విద్యార్థిని సత్కరించి స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్

తల్లిదండ్రులు గర్వించేలా ఎదగాలి

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు గర్వించేలా విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. నూకాంబిక ఆలయం వద్ద ప్రైవేట్ ఫంక్షన్ హాలులో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర సొంత నిధులతో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంగళవారం రాత్రి స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విద్యార్థులు కోరుకునే రంగంలో ఎదిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. గత ఐదేళ్లు నిర్వీర్యమైన విద్యా వ్యవస్థలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు అభివృద్ధి చెందేలా చర్యలు చేపడుతున్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో సురేంద్ర చేపట్టిన కార్యక్రమం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నతంగా చదివితే సమాజంలో తల్లిదండ్రులకు గౌరవం ఉంటుందన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ విద్యారంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గౌరీ సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీపీ నారాయణరావు, నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, మళ్ల నరసింగరావు, కె.రత్నకుమారి, మళ్ల ఉమామహేశ్వరి, పి.సుబ్రహ్మణ్యం, గవర కార్పొరేషన్ డైరెక్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. వెంకుపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్‌జీఎల్, సాంబమసూరు వంటి వరి విత్తనాలు రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వీటిని పొందేందుకు సేవా కేంద్రంలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. అనంతరం వెంకుపాలెం, సీతానగరం, సుందరయ్యపేట రైతులకు వరి విత్తనాలు అందజేశారు. కాగా వెదుళ్లగెడ్డలో తుప్పలు, మట్టి కూరుకుపోయిందని వర్షాకాలం ప్రారంభం కాకముందే వాటిని శుభ్రం చేయించాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రామారావు, ఎంఏవో రంగాచారి, సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, కూటమి నాయకులు చదరం నాగేశ్వరరావు, భరత్‌బాబు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధి కార్యక్రమాలతో మహిళాభ్యున్నతి

ఎన్ఆర్ఎల్ఎం నేషనల్ మిషన్ మేనేజర్ రాజీవ్‌కుమార్ సింఘాల్


ఎన్టీఆర్ వైద్యాలయంలో క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న రాజీవ్‌కుమార్

అనకాపల్లి టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మహిళలు ఆర్థికాభ్యున్నతి చెందుతారని ఎన్ఆర్ఎల్ఎం నేషనల్ మిషన్ మేనేజర్ రాజీవ్‌కుమార్ సింఘాల్ తెలిపారు. అనకాపల్లి జిల్లా సెర్ప్ ద్వారా మహిళలు చేపడుతున్న వివిధ జీవనోపాధి కార్యక్రమాలను మంగళవారం ఎన్ఆర్ఎల్ఎం బృందం ప్రతినిధులు పరిశీలించారు. చోడవరం మండలంలోని దుడ్డుపాలెంలో మిల్లెట్ ఆర్గానిక్ పౌడర్ తయారీ యూనిట్, వి.మాడుగుల మండలం కేజే.పురంలో బి క్యూట్ గార్మెంట్ యూనిట్‌ను బృందం ప్రతినిధులు పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్నం ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న గాటోస్ కేఫ్, సంగీత ఎంబ్రాయిడరీ టైలరింగ్ యూనిట్‌లను పరిశీలించారు. అలాగే అనకాపల్లి మండలం రాజుపాలెం వద్ద జీడిపప్పు తయారీ యూనిట్, ఎస్ఆర్.పేట గ్రామం వద్ద బెల్లం రుచులను పరిశీలించారు. అనంతరం రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి ద్వారా మహిళలు అభ్యున్నతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శచీదేవి, సెర్ప్ అధికారులు ఆర్.విజయ్‌కుమార్, కె.సరళ, హర్ష వికాశ్, విగ్నేశ్, డీఆర్‌డీఏ అడిషినల్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.డైజీ, డీపీఎంలు కె.సత్యనారాయణ, కుమారస్వామి, వెంకటరమణ, పోతల రమణ, సుశీల, రత్నప్రభ పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవ రాట ముహూర్తం


రాట ముహూర్తం చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయ అష్టమ వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 19న ఆలయం వద్ద దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా రాట ముహూర్తం చేశారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. అలాగే బుధవారం హోమాలు, గోపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు పీవీ.రమణ తెలిపారు. 19న కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పొలమరశెట్టి వెంకట అప్పారావు, వాణి దంపతులు, బుద్ధ సంతోశ్, హేమలత దంపతులు, పొలిమేర శ్రీనివాసరావు, జయ దంపతులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లకు తల్లికి వందనం అమలుచేయాలి


అనకాపల్లి జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

అనకాపల్లి టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబరు 26లో పారిశుధ్య కార్మికులకు వేతనంతో సంబంధం లేకుండా తల్లికి వందనం అమలు చేయాలని ఉన్నప్పటికీ, ఎవరికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది దుర్మార్గమైన చర్య అని వాపోయారు. నిత్యం పారిశుధ్య పనులు నిర్వహిస్తూ పారిశుధ్య కార్మికులు రోగాల బారిన పడుతున్నారని, వారికి అతి తక్కువ వేతనాలు అమలవుతున్నాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ అయినా చేయాలి లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అజయ్, శ్రీను, నూకరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ రమణకు వినతిపత్రం అందజేశారు.

ఆప్కాస్ ఉద్యోగులకు తల్లికి వందనం వర్తింపజేయాలి

తుమ్మపాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అరకొర వేతనాలతో బతుకులు నెట్టుకొస్తున్న ఆప్కాస్ ఉద్యోగులందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని జీవీఎంసీ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, ఇంజినీరింగ్, కార్యాలయ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని ఓ వైపు ఆందోళనలు చేపడుతుంటే, మరో వైపు ప్రభుత్వం సంక్షేమ పథకాలలో కోతలు పెట్టడం దారుణమన్నారు. దీంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆప్కాస్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్, ఎస్. వెంకటలక్ష్మి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బంగారు రవి, ఎర్రంశెట్టి అప్పలరాజు, సింగంపల్లి అజయ్, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్కీమ్ వర్కర్లకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ తక్కువ ఆదాయం వస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీం వర్కర్లకు, పంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో వారికి ఈ పథకాన్ని అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు రూ.11,500, హెల్పర్‌కు రూ.7 వేలు, ఆశాలకు రూ.10 వేలు ఇస్తున్నారన్నారు. వారి పిల్లలకు కూడా తల్లికి వందనం పథకం వర్తింపజేయాలన్నారు. గ్రామాల్లో రూ.20 వేలు, పట్టణాల్లో రూ.25 వేల లోపు ఆదాయం వచ్చే వారందరికీ ఈ పథకాన్ని అమలుచేయాలని ఆయనడిమాండ్ చేశారు.

నేడు యోగాంధ్ర కార్యక్రమంపై సమావేశం

సబ్బవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర-2025 కార్యక్రమంపై బుధవారం కూటమి నేతలు, కార్యకర్తలతో ముఖ్య సమావేశం జరుగుతుందని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు. కార్యక్రమానికి కూటమి నేతలు, కార్యకర్తలు, వీర మహిళలు ఉదయం 9.30 గంటలకు మండల కేంద్రంలోని ఫంక్షన్ హాలుకు హాజరుకావాలని బాబ్జీ కోరారు.

తాళ్లపాలెం గ్రంథాలయంలో రికార్డుల తనిఖీ

కశింకోట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజా మంగళవారం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాన్ని రోజుకు ఎంత మంది సందర్శిస్తున్నారనే అంశాలపై ఆరా తీశారు. గ్రంథాలయానికి డిపాజిట్ సభ్యులను ఎక్కువ మందిని చేర్పించాలని ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జగన్‌కు ఆయన సూచించారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

పరవాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో తానాం గ్రామంలో పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి మంగళవారం ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆమె కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, వార్డు సభ్యులు జి.సతీశ్, వర్రి వెంకటరమణ, వి.వసంతరావు, ఆర్.అప్పారావు, గొరుపూటి సోమినాయుడు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలను పరిష్కరించాలి

తుమ్మపాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీదేవికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫణేంద్రకుమార్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంగా అదనపు బీసీ మహిళా వసతిగృహం ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత వసతిగృహంలో దాపురించిన దుస్థితితో విద్యార్థులు తీవ్రమైన అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే వసతి గృహాల్లో సరిపడా సిబ్బందిని నియమించాలన్నారు. ఈ సమస్యలపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బి.బాబ్జి, జగదీశ్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం రేపు

సబ్బవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. ఉదయం 10 గంటల జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని సూచించారు.

యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం



సబ్బవరం మండల పరిషత్ కార్యాలయ మందిరంలో యోగా సాధన చేస్తున్న దృశ్యం... కశింకోటలో యోగాసనాలు వేస్తున్న పారిశుధ్య కార్మికులు

సబ్బవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీవో పి.పద్మజ స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాల సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన యోగా సాధన శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగా అనేది భారతీయుల నిత్య జీవితంలో అంతర్భాగమన్నారు. అటువంటి యోగాను మారుమూల గ్రామాలకు తీసుకు వెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర కృషి చేస్తున్నాయన్నారు. ఈ నెల 21న పీఎం మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు సబ్బవరం మండలం నుంచి 2050 మందిని తరలిస్తున్నట్టు ఎంపీడీవో వివరించారు. విద్యార్థుల తరలింపుకు 11 ప్రదేశాలు గుర్తించామని, వీరికి శుక్రవారం రాత్రి భోజనాలు, తెల్లవారు జామున టీ, బిస్కెట్లు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇక్కడ నుంచి బయలుదేరే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు కలిపి వంద మందికి రెండు బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి శివప్రసాద్, ఈవోపీఆర్‌డీ చైతన్య, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం, కశింకోట పరిధిలో పారిశుధ్య కార్మికులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు యోగాంధ్ర కార్యక్రమం మంగళవారం జరిగింది. యోగాంధ్ర ఇనస్పెక్టర్లు ప్రభాకర్, నూకరాజు వారితో యోగాసనాలు వేయించారు. ఈవోపీఆర్‌డీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి రోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆమె తెలిపారు.

ఇజ్రాయిల్ దాడులు ఆపాలని వామపక్షాల నిరసన

అనకాపల్లి టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయిల్ ఆటవిక దాడులు, యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణకు స్వస్తి పలకాలని డిమాండ్ చేస్తూ మంగళవారం దేశవ్యాప్తంగా జరుగుతున్న పాలస్తీనా సంఘీభావ కార్యక్రమం నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శంకరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై విచక్షణా రహితంగా క్రూరమైన దాడులకు దిగిందని, 62 వేల మందికి పైగా పాలస్తీనీయులు మరణించారన్నారు. వీరిలో మహిళలు, చిన్నారులు ఎక్కువ మంది ఉన్నారన్నారు. ఈ యుద్ధోన్మాద చర్యలు జాతి నిర్మూలనకు దారి తీస్తాయని అంతర్జాతీయ న్యాయస్థానం వ్యాఖ్యానించిందన్నారు. ఇప్పటివరకు భారత్‌లో ఎవరు అధికారంలో ఉన్నా పాలస్తీనాకు మద్దతుగానే ఉన్నారన్నారు. ప్రధాని మోదీ తప్ప ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరూ ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.వెంకన్న, వీవీ శ్రీనివాసరావు, ఆర్.రాము, బి.ఉమామహేశ్వరరావు, నాయకులు ఆర్. దొరబాబు, వైఎస్ భద్రం, డి.గురుబాబు, వియ్యపురాజు తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూచౌక్ కూడలిలో సంఘీభావ కార్యక్రమం నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

తానం కాదు... తానాం!





ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న నేమ్ బోర్డులో తానాంకు బదులు తానం అని రాసి ఉన్న దృశ్యం

పరవాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ నుంచి తానాం గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలోని తానాం గ్రామం ప్రవేశంలో రహదారికి ఆనుకొని ఏర్పాటు చేసిన నేమ్ బోర్డుపై గ్రామం పేరును తప్పుగా రాశారు. తానాంకు బదులు తానం అని రాసి ఉంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారంతా బోర్డు పై ఉన్న పేరును చూసి ఎగతాళిగా నవ్వుకుంటున్నారు. గ్రామానికి చెందిన జడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్, మాజీ ఎంపీపీ ప్రతి రోజూ ఇదే మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బోర్డుపై గ్రామం పేరు తప్పుగా రాసిన విషయం వారికి తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉంది. యువకులు, విద్యావంతులు బోర్డుపై ఉన్న పేరును చూసి నవ్వుకోవడం అలవాటైపోయింది. ఇప్పటికైనా అధికారులు గుర్తించి నేమ్ బోర్డుపై ఉన్న పేరును సరి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భార్యను గాయపరిచిన వ్యక్తి అరెస్టు

దేవరాపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాలి వీధిలో నిద్రిస్తున్న భార్యను గాయపర్చి పరారైన కోన రామును మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ నెల 13వ తేదీన భార్య కోన దేవిని కత్తితో ఎడమకాలు, చేయి, మెడ, బొటన వేలు తెగి పడినంతగా గాయపర్చి రాము పరారయ్యాడని చెప్పారు. మంగళవారం స్థానిక జగనన్న కాలనీ వద్ద అతన్ని పట్టుకొని చోడవరం కోర్టుకు తరలించామని ఎస్ఐ వివరించారు.

నీలకంఠా నగర్‌లో తాగునీటి కష్టాలు



తాగునీటి కోసం ఎదురు చూస్తున్న మహిళలు

పాడేరురూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాడేరు పట్టణంలోని నీలకంఠా నగర్‌లో తాగునీరు సరఫరా కాక ఎనిమిది నెలలుగా స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. దీనికితోడు కాలనీలో ఉన్న తాగునీటి బోర్లనుగృహనిర్మాణాల సమయంలో కొందరు ఆక్రమించి వాటిని కప్పేశారన్న ఆరోపణలున్నాయి. సోలార్ పంపు, ఓ బావి మరమ్మతుల పాలైంది. వీటి ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు స్పందనలో వినతులు అందించిన ప్రయోజనం లేక పోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో తాగునీటికి ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలో మోటార్లు ఉన్న గృహ యజమానుల ఇళ్లకు వెళ్లి వారి దగ్గర నుంచి రోజుకు ఒకటి, రెండు బిందెల చొప్పన నీటిని తీసుకుని వినియోగించుకొనే పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ



అనంతగిరి సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ పనుల్లో విద్యుత్‌శాఖ సిబ్బంది

అనంతగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో.. గత రెండురోజులుగా తరచూ విద్యుత్ అంతరాయం నెలకొంటోంది. దీంతో ఏఈ రామలింగేశ్వరరావుఆదేశాల మేరకు.. సిబ్బంది మంగళవారం ఉదయం అరకు నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువచ్చి మార్చారు. విద్యుత్ సిబ్బంది రాత్రి 7 గంటల తరువాత ఈ పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతోపాటుగా పిడుగుపాటుకు త్రీ ఫేస్ సప్లై నడుస్తున్న 100 కేవీట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీనిని మా ర్చారు. కార్యక్రమంలోఎల్ఐ రవికాంత్, లైన్‌మెన్ సురేశ్, మధు, సత్యనారాయణ, సతీశ్ పాల్గొన్నారు.

మలేరియాగా తేలితే మందులు వాడాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి హిమబిందు

సీలేరు, జూన్ 17 , (ఆంధ్రజ్యోతి) : జ్వర పీడితులు వైద్య పరీక్షల అనంతరం మలేరియా నిర్ధారణ అయితే తప్పనిసరిగా మందులు వాడాలని ధారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డీకె హిమబిందు గిరిజనులకు సూచించారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని మాదిమళ్ల గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 97 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఐదుగురు జ్వర బాధితులకు రక్తపరీక్షలను నిర్వహించగా ఇందులో ఎవరికీ మలేరియా నిర్ధారణ కాలేదు. ఈ సందర్భంగా వైద్యాధికారి గిరిజనులతో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఎపిడిమిక్ సీజన్ ప్రారంభమైయిందన్నారు. అందువల్ల ఎవరికైనా జ్వరాలు సోకిన వెంటనే ఆసుపత్రికి వచ్చి వెంటనే రక్త పరీక్షలను చేయించుకోవాలన్నారు.మలేరియా, టైఫాయిడ్ నిర్ధారణయితే పూర్తి స్థాయిలో మందులు వాడాలని లే కుంటే ప్రాణాలమీదకు వస్తోందని అవగాహన కల్పించారు. అలాగే చిన్న పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి. లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్వోకు ఘనంగా వీడ్కోలు



గోవిందరాజులును సత్కరిస్తున్న ఉద్యోగులు

పాడేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం బదిలీపై వెళుతున్న డీపీఆర్వో పి.గోవిందరాజులుకు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు, విలేకరులు మంగళవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గోవిందరా జులు మాట్లాడుతూ.... గత మూడేళ్ల ప్రభుత్వ ప్రచార కార్య క్రమాల్లో సహకారం అందించిన అధికారులు, పాత్రికేయులకు ధన్యావాదాలు తెలియజేశారు. గిరిజన ప్రాంతమైన అల్లూరి జిల్లాలో సేవలందించడం సంతృప్తికరంగా ఉందన్నారు. డీపీఆర్వో బాల్మాన్‌సింగ్, డివిజనల్ పీఆర్వో పి.రాములు, సిబ్బంది పి.శ్రీనివాసరావు, కె.సంధ్యారాణి, వరలక్ష్మి, పుష్ప పాల్గొన్నారు.

సీడీపీవోకు సన్మానం

కొయ్యూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుకు సీడీపీవో విజయకుమారి ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. మంగళవారం స్థానిక గిరిజన భవన్‌లో బదిలీపై నూజివీడు వెళ్తున్న కొయ్యూరు ప్రాజెక్టు సీడీపీవో విజయకుమారి వీడ్కోలు సభ ప్రస్తుత సీడీపీవో దేవమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమారిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందచేశారు. మండలంలో సీడీపీవోగా రెండున్నరేళ్ల అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు అందుకున్నారని కొనియాడారు. అంగన్‌వాడీలు, సిబ్బంది పాల్గొన్నారు.



అరకులోయలో ఎస్‌బీఐ సేవా కేంద్రం ఎదుట కూర్చున్న తల్లిదండ్రులు



చింతపల్లి యూబీఐ బ్యాంక్ సమీపంలోనున్న ఏటీఎం ఏజెంట్ వద్ద..

తల్లికి వందనం లబ్ధిదారులతో బ్యాంకులు కిటకిట

- నగదు విత్‌డ్రాకు గ్రామాలనుంచి మండల కేంద్రాలకు రాక
- ఏటీఎం ఏజెంట్లు అదనపు చార్జీల వసూలు

చింతపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తల్లికి వందం లబ్ధిదారులతో కిటకిటలాడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చదువుతున్న పిల్లలందరికి తల్లికి వందనం పథకం ద్వారా నగదును అందజేసింది. ఈ సొమ్ము తల్లుల ఖాతాల్లో జమచేశారు. దీంతో తల్లులు బ్యాంక్ నుంచి నగదు డ్రాకు పెద్ద సంఖ్యలో మంగళవారం మండల కేంద్రానికి తరలి వచ్చారు. అలాగే, పరిసర ప్రాంతాల్లోనున్న ప్రైవేటు మినీ ఏటీఎం ఏజెంట్లు వద్ద నగదును తీసుకుంటున్నారు. అయితే, ఏటీఎం ఏజెంట్లు రూ.వెయ్యికి రూ.20 అదనంగా తీసుకుంటున్నారు. గంటలతరబడి బ్యాంక్ వద్ద నిరీక్షించలేక లబ్ధిదారులు ఇలా సొమ్ము విత్‌డ్రా చేస్తున్నారు.

అరకులోయలో..

అరకులోయ: ప్రభుత్వం విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు తల్లికి వందనం పేరిట పథకం అమలు చేస్తోంది. ఈ నగదు తల్లుల ఖాతాల్లోకి జమకావడంతో పెద్ద ఎత్తున గిరి మహిళలు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. అలాగే, సీఎస్‌సీ సెంటర్లు, నెట్ సెంటర్ల వద్ద డబ్బులు విత్‌డ్రాలు చేసుకుని, విద్యార్థులకు అవసరమైన సామగ్రి కొనుగోలుకొనుగోలు చేస్తున్నారు. మరికొందరు సెల్ ఫోన్లు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ముగ్గురి పిల్లల వరకు తల్లికి వందనం డబ్బులు తమ ఖాతాల్లో జమ అయినట్టు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. దీంతో



జి.మాడుగుల గ్రామీణ బ్యాంక్ వద్ద లబ్ధిదారులు

సోమ, మంగళవారాలు అరకులోయ వీరితో రద్దీగా మారింది. దీనికితోడు ఉపాధి పథకం వేతనాలు కూలీల ఖాతాలలో జమకావడంతో అరకులోయ గిరిజనంతో కళకళలాడింది. అలాగే, పాఠశాలలు, వసతి గృహాలకు పలువురు విద్యార్థులు హాజరవుతున్నారు.

జి. మాడుగులలో..

జి.మాడుగుల: మండలంలోని బ్యాంకులు తల్లికి వందన లబ్ధిదారులతో కిక్కిరిసిపోయాయి. దీంతో మంగళవారం వారపు సంతకావడంతో గ్రామాలనుంచి అధిక సంఖ్యలో తల్లులు బ్యాంకుల వద్దకు రావడంతో రద్దీగా మారా యి. స్థానిక గ్రామీణ వికాస్, యూనియన్ బ్యాంకుల వద్ద బారులు తీరారు. ఇదిలా ఉండగా, తల్లికి వందనం నిధులు జమకాని తల్లులు ఆయా సచివాలయాల వద్ద వెళ్లి నిరీక్షిస్తున్నారు.

వలిసెల విత్తనాలు పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ప్రధాన శాస్త్రవేత్త బయ్యపురెడ్డి

గూడెంకొత్తవీధి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం దత్తత గ్రామం దుశ్శరపాలెం రైతులకు శాస్త్రవేత్తలు వలిసెల విత్తనాలు పంపిణీ చేశారు. మంగళవారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బయ్యపురెడ్డి వలిసె విత్తనాలు, జీవన ఎరువులను అందజేశారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రైతులకు పలు రకాల విత్తనాలు, సాంకేతిక సహకారం అందిస్తున్నారు. ముందస్తు రబీలో వలిసెల సాగుకు అనువుగా ఒక్కొక్క రైతుకి మూడు కిలోల విత్తనాలు అందజేశారు. పెసా కమిటీ అధ్యక్షులు సాగిన భీమేశ్వరపడాల్, రైతులు సాగిన జోగిపడాల్, రాంబాబు, గోపి, బంగార్రాజు, లక్ష్మీపడాల్, నారాయణ, రామచంద్ర, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకి సిద్ధం కావాలి

చింతపల్లి: గిరిజన రైతులు ఖరీఫ్ సాగుకి పొలాలను సిద్ధం చేసుకోవాలని స్థానిక ఏవో శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం ముల్లుమెట్ట గ్రామంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న పచ్చిరొట్ట ఎరువు సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట వేసిన 45 రోజుల తరువాత భూమిలో కలియ దున్నుకోవాలన్నారు. దీని వల్ల పంటలకు అవసరమైన సూక్ష్మపోషకాలు అందుతాయన్నారు. రైతులు దుక్కులు చేపట్టాలని కోరారు.

19 నుంచి సమగ్ర శిక్షలో బదిలీలు

పాడేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సమగ్ర శిక్ష విభాగంలో ఈనెల 19 తేదీ నుంచి బదిలీ ప్రక్రియను ప్రారంభిస్తామని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ. స్వామినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 21 వరకు బదిలీ దరఖాస్తుల స్వీకరణ, 23న సీనియారిటీ జాబితా తయారీ, 24న సీనియారిటీ జాబితా ప్రదర్శన, 27న అభ్యంతరాల స్వీకరణ, 28న సీనియారిటీ తుది జాబితా వెల్లడి, 30 నుంచి జూలై 2న బదిలీలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు.

నేడు డుంబ్రిగుడ మండల సమావేశం

డుంబ్రిగుడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ప్రేమ్ సాగర్ తెలిపారు. ఎంపీపీ భాక ఈశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయులను నియమించాలని ఆందోళన



పెదపాడులో నిరసన వ్యక్తంచేస్తున్న తల్లిదండ్రులు

డుంబ్రిగుడ, జూన్ 17 (ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయులను నియమించాలని పెదపాడు పీవీటీజీ గిరిజనులు ఆందోళన చేపట్టారు. కోర్రా పంచాయతీ బోర్రాపాలెం, పెదపాడు గ్రామాల్లో గిరిజన ప్రాథమిక పాఠశాల కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలల్లో సీఆర్‌టీల నియమించలేదు. ప్రస్తుతం ఈ ఏడాది పాఠశాలలు పునః ప్రారంభమయ్యి ఆరు రోజులవుతోంది. ఇన్ని రోజులుగా చిన్నారులు చదువుకు దూరంగా ఉన్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాదిగా ఇదే దుస్థితి నెలకొంటున్నట్టు వాపోయారు. అలాగే, సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని గిరిజన సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

వైసీపీ బలోపేతానికి సమష్టి కృషి: జడ్పీ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సమష్టి కృషి ఎంతో అవసరమని విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె ముఖ్యనేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు ఇప్పటి నుంచే పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జేవీవీఎన్ మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జగబంధు, పార్టీ మండల అధ్య క్షుడు పాంగి పద్మారావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నేతలు,పాల్గొన్నారు.

రామాలయానికి ఫ్లోరింగ్ టైల్స్ వితరణ



ఫ్లోరింగ్ టైల్స్ అందిస్తున్న ప్రసాద్ తదితరులు

కొయ్యూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) మర్రివాడలో నిర్మాణంలో ఉన్న రామాలయానికి కొయ్యూరుకు చెందిన టీడీపీ నాయకులు అనిశెట్టి చిరంజీవి రూ. 50 వేల విలువ చేసే ఫ్లోరింగ్ టైల్స్‌ను వితరణగా అందచేశారు. మంగళవారం గ్రామ పెద్దలు కంకిపాటి బాబూరావు, పొత్తూరు అబ్బు, నాగయ్యలతో పాటు మహిళల సమక్షంలో జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ చేతుల మీదుగా ఈ టైల్స్‌ను ఆలయ కమిటీకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బి. శివరామరాజు, అల్లూరి యువజన సంఘ అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు ఏవోగా భాను ప్రియాంక



భాను ప్రియాంక

కొయ్యూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయశాఖాధికారిణిగా భాను ప్రియాంక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఏవోగా పనిచేసిన డి. ఉమాదేవి విశాఖపట్నం జిల్లా చినగదిలి ఏవోగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో టెక్కలి మండలంలో ఏవోగా పని చేస్తున్న భాను ప్రియాంకను ఇక్కడ ని యమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అం దుబాటులో సేవలందిస్తానన్నారు. అవసరమైన సలహాలకు ఫోన్: 8331056450ను రైతులు సంప్రదించాలన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం, ప్రశాంతత

పాడేరురూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగాను దినచర్యగా మార్చుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. వనుము చిట్టిబ్బాయి విద్యార్థులకు సూచించారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారిత శాఖ, కళాశాల ఐక్యూఏసీ వారి ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది యోగాసనాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 860 మందితో యోగాం ధ్ర రిజిస్ట్రేషన్ చేయించినట్టు చెప్పారు. ఈ నెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని కళాశాల ప్రాంగణంలో వె య్యి మందితో యోగాసనాలకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు మాట్లాడుతూ 18వ తేదీన వెయ్యి మంది విద్యార్థులతో యోగాంధ్రాపై అవగాహన ర్యాలీ



చాపరాయిలో యోగా చేస్తున్న అధికారులు

నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ టీఏస్ రసూల్, పి.కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు రమేశ్‌బాబు, జానకీ రామ్ పాల్గొన్నారు.



పాడేరు డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు యోగా సాధన

చాపరాయిలో..

డుంబ్రిగుడ: యోగాంధ్ర కార్యక్రమం ఎంపీడీఓ ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం చాపరాయి జలవిహారిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రతి రోజూ క్రమం తప్పకుండా చేస్తే శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొని పలు ఆసనాలు చేశారు. ఏఈఈ అజయ్, ఇన్‌ఛార్జ్ ఈవోఆర్డీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూములను పరిరక్షిస్తాం: డీఈవో



బూరుగులమ్మతల్లి ఆలయ భూములను పరిశీలిస్తున్న జిల్లా అధికారిణి సుధారాణి

కొయ్యూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా దేవదాయశాఖ ఆధీ నంలోని భూములు పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా దేవదాయ శా ఖాధికారిణి సుధారాణి తెలిపారు. మంగళవారం మండలంలో కొయ్యూరు మల్లికార్జునస్వామి, రామాలయం, బూరుగులమ్మ తల్లి ఆలయాల భూములతో పాటు పెదమాకవరం బ్ర హ్మలింగేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. ఈ ఆలయాలకు సంబందించిన దే వుని మాన్యాలపై డీఈవో ఆరా తీశారు. ఈ భూములు ఎవరి సాగులో ఉన్నాయి, వీటి ద్వారా ఆలయాలకు వస్తున్న ఆదాయం, ఆక్రమణలకు గురయ్యాయా... అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహశీల్దారు కార్యాలయంలో రికార్డులు, వెబ్‌ల్యాండ్‌లో వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేవాలయాలకు సంబంధించిన భూములు ఆధీనంలోని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలన జరుపుతున్నామన్నారు. దేవాయాల భూ ములు గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్ని మండలాల తహశీల్దార్లను కోరామన్నారు. అలాగే, గత ప్రభుత్వ హయాంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో మంజూరైన కాకరపాడు వెంకటేశ్వరస్వామి, నిమ్మలపాలెం రామాలయాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారి డి. ఉమాదేవి, జూనియర్ అసిస్టెంట్ చంద్రతేజ, జీసీసీ మాజీ చైర్మన్ ఎవివి ప్రసాద్, కొయ్యూరు సర్పంచ్ బాలరాజు, ఎస్ఎస్ఎఫ్ ప్రముఖ్ కొండబాబు, బీజేపీ నేతలు పద్మరాజు, చక్రరావు, నాగేశ్వరావు, వెంకటేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీలకు పట్టాలులేక అన్నదాత సుఖీభవకు దూరం

గూడెంకొత్తవీధి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవరం, కొత్తపాలెం పీవీటీజీలకు పట్టాలులేక అన్నదాతసుఖీభవకు దూరం కావాల్సివస్తుందని టీడీపీ మాజీ జిల్లా కార్యదర్శి ముక్కలి మహేశ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వీరవరం, కొత్తపాలెం గ్రామాల్లో 150 ఆదిమజాతి ఆదివాసీ కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. సుమారు 70ఏళ్లగా అటవీ భూములను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. వీటికి పట్టాలులేకపోవడం వల్ల రైతు భరోసా, అన్నదాత సుఖీభవ పథకాలకు అందడంలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సర్వే నిర్వహించి అర్హులందరికీ సాగు హక్కు పట్టాలు అందజేయాలన్నారు.

'కాశీపట్నంలో మెడికల్ ల్యాబ్ ఏర్పాటు చేయండి'

అనంతగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నం ఆరోగ్య ఉపకేంద్రం వద్ద అన్ని వైద్య పరీక్షలు నిర్వహించేలా మెడికల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని వైసీపీ మండల అధ్యక్షుడు కొర్రా సూర్యనారాయణ కోరారు. కాశీపట్నం, ఎన్ఆర్‌పురం, చిలకలగెడ్డ, కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉండే.. గ్రామాల గిరిజనులు సీజనల్ వ్యాధులు సోకితే... ఎస్.కోట వెళ్లి ప్రైవేట్ ల్యాబ్‌ల్లో రక్తపరీక్షలు చేయించుకోవాల్సి వస్తోందన్నారు. ఈ స్థితిలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, తదితర ప్రాథమిక పరీక్షలన్నీ కాశీపట్నంలో నిర్వహించేలా ల్యాబ్ ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాలని కోరారు.

అభివృద్ధి దిశగా గిరిజన గ్రామాలు



గుమ్మకోటలో మాట్లాడుతున్న సర్పంచ్ అప్పారావు

అనంతగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):గిరిజన గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని సర్పంచ్ పాగి అప్పారావు, ఎంపీపీ నీలవేణి అన్నారు. మండలంలోని గుమ్మకోట పంచాయతీ కేంద్రంలోని ధర్తీ అబ జన భగీదరి అభియాన్ కార్యక్రమం మంగళవారం సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగింది. ఎంపీపీ శెట్టి నీలవేణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా సర్పంచ్ అప్పారావుమాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ఆర్థికంగా ఎదగాలని స్థానికులకు సూచించారు. వివిధ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు తౌటినాయుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మజ్జి భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ముంచంగిపుట్టు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరిముఖిపుట్టు పంచాయతీ వెచ్చంగి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు భాగ్యవతి సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. సుమారు 25 మంది విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ తదితర సామగ్రి అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రతినిధి పూర్ణ మాట్లాడుతూ తమ సేవా సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చేయూతను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు జయరాం, యూన్సీ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

సీలేరు, జూన్ 17 , (ఆంధ్రజ్యోతి) : సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతపల్లి క్యాంప్‌నకు చెందిన వంతల భగత్‌రామ్ ద్విచక్ర వాహనం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భగత్‌రామ్ సోమవారం సాయంత్రం సీలేరు జెన్‌కో కాలనీలోని 5వ క్రాస్‌రోడ్డులోని తన స్నేహితుని ఇంటికి వెళ్లారు. ఇంటి ఎదుట బైక్ పార్కింగ్ చేసి లోనికి వెళ్లి, కొంత సమయం తరువాత వచ్చి చూసేసరికి అక్కడ తన వాహనం కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు భగత్‌రామ్ తెలిపారు. అలాగే బైక్ చోరీకి లోనైన పక్క ఇంట్లో కూడా ఆగంతకులు కిటికీలు బద్దలకొట్టి దొంగతనానికి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ, బైక్ చోరీపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'కూటమి ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయాలు'

అనంతగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలన కక్ష పూరిత రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని వైసీపీ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై వైసీపీ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు.. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కొర్రా సూర్యనారయణ, ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాజ్యాంగాన్ని చేతిలోకి తీసుకుని పాలన సాగిస్తోందన్నారు. మహిళలు, బాలికలపై వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అసెంబ్లీ అధ్యక్షుడు స్వామి, సర్పంచులు అప్పారావు, సన్యాసిరావు, ఎంపీటీసీ సభ్యులు మితుల, అశోక్, మధుసూదన్, లక్ష్మణరావు, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో 31.7 డిగ్రీల ఉష్ణోగ్రత

పాడేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో అల్పపీడనంతో వాతావరణంలో మార్పులు చోటు చే సుకున్నా, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులేదు. ఏజెన్సీలో మంగళవారం కొయ్యూరులో 31.7 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, పాడేరు, చింతపల్లిలో 29.5, డుంబ్రిగుడలో 28.9, హుకుంపేట, అరకులోయ 28.0, అనంతగిరిలో 27.6, పెదబయలులో 27.4, జీకేవీధిలో 26.4, జి.మాడుగులలో 26.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

బీవీకే పాఠశాలలో ప్రవేశాలు

హుకుంపేట జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీవీకే పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశాలు జరుపుతున్నట్టు ప్రిన్సిపాల్ కె. అప్పలకొండ పడాల్ తెలిపారు. ఎల్‌కేజీలో 10 మంది, యూకేజీలో 6 సీట్లు, ఒకటో తరగతి 11 సీట్లు, 2వతరగతి 14 సీట్లు, 3వ తరగతి 21 సీట్లు 4వ తరగతిలో 11, ఆరో తరగతిలో 9 ఖాళీలున్నట్టు చెప్పారు. ఆసక్తిగల వారు ఫోన్: 8688 975191ను సంప్రదించాలని సూచించారు.

కానరాని పర్యాటకుని ఆచూకీ

ముంచంగిపుట్టు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా -ఒడిశా సరిహద్దు ప్రాంతం(ఏవోబి)లో గల డుడుమ జలపాతంలో గల్లంతైన పర్యాటకుడు అనిమెష్‌దాస్ (27) ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది, కోల్‌కతాకు చెందిన అనిమెష్‌దాస్ తన కుటుంబ సభ్యులతో కలసి గత శనివారం డుడుమ జలపాతం చూసేందుకు వచ్చి ప్రమాదవశాత్తు అందులో మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. మంగళవారం జలపాతం ఎగువ ప్రాంతంలో ఉన్న డుడుమ జలాశయానికి చెందిన 6, 7 గేట్లను ఎత్తివేసి 2వేల క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేశారు. నీటి ఉధృతితో రాళ్ల మధ్యలో చిక్కుకున్న మృతదేహం బయటకు వచ్చే అవకాశం ఉందనే ఉద్దేశంతో నీటిని గంటపాటు విడుదల చేసినా ఫలితం కానరాలేదు. దీంతో యథావిధిగా అగ్నిమాపక సిబ్బంది, ఓడీఆర్ఎఫ్ సహాయక బృందాలు గాలింపు కొనసాగించాయి.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

▸▸ మండల సమావేశంలో ఎంపీపీ మణికుమారి

గొలుగొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ గజ్జలపు మణికుమారి చెప్పారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కంతారం గ్రామ పంచాయతీలో ప్రభుత్వం నుంచి ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా ఉపాధి వీఆర్‌పీని నియమించడం తగదని సర్పంచ్ రాజేశ్వరి అధికారులను నిలదీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కొత్తగా వీఆర్‌పీని నియమించినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. అలాగే ఏఎల్.పురం వీఆర్‌పీని తొలగించడం అన్యాయమని గ్రామ సర్పంచ్ లోచుల సుజాత, ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్ పేర్కొన్నారు. సోషల్ ఆడిట్‌లో అక్రమాలు జరిగినట్టు గుర్తించి వీఆర్‌పీలను తొలగించామని ఎంపీడీవో వెల్లడించారు. శాఖల వారీగా మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజా ప్రతినిధులను కోరారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యులకు సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు జక్కు నాగమణి, ఆదినారాయణ, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మేరీరోజీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయానికి మైక్‌సెట్ వితరణ


మైక్‌సెట్ అందజేస్తున్న శ్రీనాధు శ్రీనివాసరావు

మాడుగుల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం రామలింగేశ్వర శివాలయానికి ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాధు శ్రీనివాసరావు రూ.23వేలు విలువైన మైక్‌సెట్‌ను ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మరిడిమాంబ అమ్మవారి పండగ రేపు

మాడుగుల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాడుగుల శివారు ఖండివరం వెళ్లే దారిలో గల మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం నిర్వహించేందుకు మోదకొండమ్మ, మరిడిమాంబ కమిటీల సభ్యులు చర్యలు తీసుకున్నారు. జూన్ 19న జరిగే పండగకు సంబంధించి మంగళవారం ఉదయం అమ్మవారి ఘటాలను మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో శతకంపట్టు వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. తిరిగి మూడో రోజు పండగ రోజున తిరిగి అమ్మవారి ఆలయానికి తీసుకువస్తారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనాధు శ్రీనివాసరావు, సర్పంచ్ యడ్ల కళావతి, వైస్‌ఎంపీపీ పొలిమేర విజయలక్ష్మి, చిన్నారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజా ప్రతినిధుల ధ్వజం

▸▸ నర్సీపట్నం మండల సర్వసభ్య సమావేశం

నర్సీపట్నం అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలపై ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. ప్రధానంగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై గళం విప్పారు. అనంతరం అధికారుల వివరణతో శాంతించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సత్యవతి తమ శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను వివరిస్తుండగా, ఓఎల్‌పురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనధికారిక ప్రజాప్రతినిధిగా వ్యవహరిస్తూ ఉపాధి పనుల్లో పాలుపంచుకుని కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సర్పంచ్ నాగరాజు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీవో ఉషశ్రీ హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. అలాగే దుగ్గాడ పంట కాలువ పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలని వేములపూడి ఎంపీటీసీ-1 బోళం రామప్రసాద్ కోరారు. మొండికండిలో అంగన్‌వాడీ కేంద్ర భవనం కూలడానికి సిద్ధంగా ఉందని, అవసరమైతే నూతన భవన నిర్మాణానికి గ్రామస్థులు స్థలాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని వేములపూడి ఎంపీటీసీ సభ్యుడు బోళం రామప్రసాద్ తెలిపారు. ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్చడంతో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గిందని చెప్పారు. దీంతో 6, 7 తరగతుల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

మండలంలోని 6359 మంది విద్యార్థులకు తల్లికి వందనం కింద తల్లుల ఖాతాలకు నగదు జమ చేసినట్టు ఎంఈవో తులువు తెలిపారు. వరి విత్తనాలు కావాల్సిన రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్‌తో పేర్లను నమోదు చేసుకోవాలని ఏవో విజయలక్ష్మి సూచించారు. 50 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు, మామిడి, జీడిమామిడి మొక్కలు అందిస్తున్నామని పశు సంవర్థక, ఉద్యానవన శాఖల అధికారులు తెలిపారు. కాగా, పలువురు అధికారులు పూర్తి సమాచారంతో రాకపోవడంతో ఎంపీపీ మండిపడ్డారు. వచ్చే సమావేశానికి పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి వి.రమణబాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చెత్తాచెదారం తొలగింపు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

మాకవరపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో చెత్త కుప్పలను పంచాయతీ అధికారులు మంగళవారం తొలగించారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంపై ఈ నెల 15వ తేదీన 'పారిశుధ్యం.. అధ్వానం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. ఈ మేరకు జి.కోడూరు రహదారిపైన, సచివాలయం వద్ద నెల రోజులుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ చెత్తాచెదారాన్ని పంచాయతీ కార్యదర్శి సంతోశ్ ట్రాక్టర్లలో బయటకు తరలించారు.



జి.కోడూరు సచివాలయం వద్ద చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్... లచ్చన్నపాలెంలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

అలాగే లచ్చన్న పాలెంలో రహదారిపై ఉన్న చెత్తను కూడా తొలగించారు. అనంతరం చెత్తను తొలగించిన చోట బ్లీచింగ్ చల్లారు. ఇకపై రహదారులపై చెత్తను వేస్తే అపరాధ రుసుం విధిస్తామని ఆయా గ్రామాల ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు హెచ్చరించారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

కృష్ణాదేవిపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గొలుగొండ ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటఅల్లూరిపార్కులో మండలంలో గల అన్ని పంచాయతీల పారిశుధ్యకార్మికులకు యోగా పాల్గొని ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావుమాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా మీద దృష్టిపెట్టి ఆరోగ్యం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. యోగా మన సమగ్ర జీవన విధానమని శారీరక , మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగాన్ని మెరుగుపరిచే శక్తి వంతమైన సాధనమని తెలిపారు. యోగాతో మధుమేహం వంటి వ్యాధులు నియంత్రణలో ఉంచుకోవచ్చునన్నారు. కార్యదర్శులు అప్పారావు, కుమార్, అశోక్ పాల్గొన్నారు.


కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో యోగాసనాలు వేస్తున్న పారిశుధ్య కార్మికులు

డీజీ లక్ష్మీలకు శిక్షణ

నర్సీపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని మెప్మా కార్యాలయంలో డిజిటల్ లక్ష్మీలకు మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్మిక శాఖ అధికారి రామచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ ఈ శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల గుర్తింపు ప్రక్రియ, కార్డులు తదితర అంశాల కోసం 36 మంది డీజీ లక్ష్మీలకు ఈ శిక్షణ అందించారు.

వరి సాగుకు సన్నద్ధం కావాలి

మాకవరపాలెం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి సాగుకు రైతులు సన్నద్ధం కావాలని వ్యవసాయ శాఖాధికారి డి.అప్పారావు సూచించారు. గిడుతూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వారం రోజుల్లో వరి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ ఏడాది ముందుగా వర్షాలు కురవడంతో వరిసాగు ఆశాజనంగా ఉంటుందని చెప్పారు. అలాగే దమ్ములకు ముందు జీలుగుతో పాటు జనుము, పిల్లపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు వేయాలని సూచించారు. దీనివల్ల భూమి సారవంతమై అధిక దిగుబడుల వస్తాయ న్నారు.

జోగంపేటలో 'పొలంబడి'

గొలుగొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపేట గ్రామంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సుధావాణి మాట్లాడుతూ రైతులు అవగాహనతో పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ సీజన్‌లో పలు పంటలపై అవగాహన చేసుకుని సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని వివరించారు. అలాగే ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఆమె తెలిపారు.

కోదండరాముని కల్యాణం

గొలుగొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం గ్రామంలో బుధవారం కోదండరాముని కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం కోదండరాముని విగ్రహాలను జోగంపేట, గొలుగొండ, నర్సింగబిల్లి, ద్వారకానగరం గ్రామాల్లో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కల్యాణానికి సుమారు 200 మంది దంపతులు పాల్గొంటున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నిరుపేదలకు చీరల పంపిణీ

నాతవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలం శృంగవరం గ్రామంలో మంగళవారం సుర్ల అప్పలకొండ 8వ వర్థంతిని పురస్కరించుకుని సుర్ల నూకరాజు పేదలకు చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఉలబాల అప్పలనాయుడు,కొంద్రు అప్పారావు, నర్సీపట్నం నూకాంబికా ఆలయకమిటీ చైర్మన్ కోరుప్రోలు శ్రీను లెక్కల శ్రీనివాసరావు సుర్ల చిన్నశ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

నాతవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నాతవరంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అవసరమైన మందులను ఉచితంగా అందిస్తామని చెప్పారు. ఈ శిబిరాన్ని జ్వరాలతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తకోట భూ సమస్యపై కలెక్టర్‌కు వినతి


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రైతులు, తాతయ్యబాబు, పీవీఎస్ఎన్ రాజు

రావికమతం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట భూ సమస్యపై రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, పలువురు రైతులు మంగళవారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు విన్నవించుకున్నారు. డొండపూడి రెవెన్యూ పరిధిలో 65 ఎకరాల ప్రభుత్వ భూమిని కొత్తకోటకు చెందిన వంద మంది రైతులు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. అయితే పూర్వీకుల నుంచి తమ సాగులో ఉన్న ఈ భూములను రికార్డులో అధికారులు నమోదు చేయలేదన్నారు. 2007లో కోర్టును ఆశ్రయించగా ఆ భూములపై రైతులకే హక్కు కల్పించాలని కోర్టు ఆదేశించిన రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. 2020లో వైసీపీ ప్రభుత్వం భూములను ఇళ్ల నిర్మాణ పేరుతో లాక్కోవడానికి ప్రయత్నించగా కోర్టు సాగుదారులకు రక్షణ కల్పించిందని వివరించారు. ఈ భూములపై తమకు జిరాయితీ హక్కులు కల్పించేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టరు ఈ భూములపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి, జనసేన మండల అధ్యక్షుడు మైచర్ల నాయుడు, చింతల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జిగా రమణ



రోలుగుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సంఘం చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా శరభవరం గ్రామానికి చెందిన పులగుజ్జుల రమణను ఎన్నుకున్నారు. మంగళవారం చోడవరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమణను జిల్లా అధ్యక్షుడు నీటిపల్లి ముత్యాలరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కండెపల్లి వెంకటరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తల ఈశ్వరరావు, ప్రచార కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

విద్యా మిత్ర కిట్లు పంపిణీ

రావికమతం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నదని టీడీపీ సీనియర్ నాయకుడు వెదురుపర్తి వెంకటారి అన్నారు. మంగళవారం ఆయన డొండపూడి హైస్కూల్‌లో 145 మంది విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందక రాజేశ్వరరావు, పాతాళ చిరంజీవి, కొప్పాక నాయుడు, హెచ్ఎం బంటు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి పాము కాటు

రావికమతం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడకు చెందిన గొర్లె సాయి కిరణ్(18) పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. సాయికిరణ్ సోమవారం తమ పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో పాము కరిసిందని కేకలు వేయడంతో వెంటనే రావికమతం పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు.

రైతు సంక్షేమానికి సీఎం చంద్రబాబు పెద్దపీట

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక రైతుభరోసా కేంద్రం వద్ద సబ్సిడీపై మంజూరుచేసిన విత్తనాలు, పవర్‌టిల్లర్‌లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న కాలంలో రైతు వ్యవసాయం చేసుకునే దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ నాయకుడు అద్దెపల్లి జగ్గారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంజిత్‌వర్మ, వైస్‌ఎంపీపీ పొలిమేర విజయలక్ష్మి, నందారపు సన్యాసిరావు, పుప్పాల రమేష్, లెక్కల కాశిబాబు, జొన్నపల్లి రమేష్, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా పంటలు అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎమ్మెల్యే బండారు.సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళవారం వరి విత్తనాలను ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మితో కలిపి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పచ్చిరొట్ట ఎరువులు వేసుకుంటే దిగుబడి వస్తుందన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నియోజకవర్గంలో 1006 పవర్ టిల్లర్‌లు రాయితీపై మంజూరయ్యాయని, అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం తల్లికి వందనం పథకంలో లబ్ధి పొందిన తల్లులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, దొగ్గనాయుడు, సర్పంచ్ పెంటమ్మ, జనసేన నాయకుడు రామ్మూర్తినాయుడు, వ్యవసాయ అధికారిణి ఎల్‌వై.కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో..

స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళవారం రాయితీపై వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు.


మాడుగులలో పవర్‌టిల్లర్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

మండలంలో 21 పవర్ టిల్లర్లు, 17 దమ్ముదుక్కి సెట్లు, 21 బ్యాటరీ స్ప్రింకర్లు అందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, ఎంపీపీ కురచా జయమ్మ, మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ, ఎంపీడీవో బి.రామచంద్రరరావు, తహశీల్దార్ కిశోర్ లింకన్, వ్యవసాయ అధికారిణి ఎ.కృష్ణవేణి, టీడీపీ నాయకులు గండి మునిలినాయుడు, గండి లక్ష్మి, యర్రా అప్పారావు, బి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

కె.కోటపాడులో..

తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు అనేక రాయితీలతో కూడిన పథకాలు ప్రవేశపెట్టిందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మేడిచర్లలో రైతులకు పవర్ టిల్లర్స్, వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన రాయితీలన్నీ జగన్ ప్రభుత్వం రద్దు చేసి రైతుల నడ్డి విరిచిందని విమర్శించారు. ప్రస్తుతం చంద్రబాబునాయుడు గతంలో ఇచ్చిన పథకాలన్నీ పునఃప్రారంభించారన్నారు. అంతకు ముందు ఆర్లే, వారాడ, పైడంపేట, రొంగలి నాయుడుపాలెం, కొరువాడ, మేడిచర్ల రైతులకు పవర్ టిల్లర్స్, విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రొంగలి మహేష్, జూరెడ్డి రాము, సబ్బవరపు రామునాయుడు, పూడి నారాయణమూర్తి, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.


మేడివాడలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

▸▸ ఈపీడీసీఎల్ మాడుగుల ఏడీఈ సురేష్ కుమార్

రావికమతం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ మాడుగుల ఏడీఈ సురేష్‌కుమార్ హామీ ఇచ్చారు. గ్రామంలో విద్యుత్ సమస్యలపై సోమవారం నర్సీపట్నం ఈఈ ఎస్. జనార్దనరావుకు గ్రామ సర్పంచ్ వజ్రపు లీలా, గ్రామస్థులు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఏడీఈ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులతో లోవోల్టేజీ ఉన్న 4,5,6 వార్డులలో ఆయన పర్యటించారు. ఇక్కడ 16 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గుర్తించారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని కూడా గ్రామస్థుల అంగీకారంతో ఎంపిక చేశారు. అలాగే గ్రామంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు మార్పు చేయడానికి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపుతామని ఏడీఈ తెలిపారు. అనుమతులు వచ్చే వరకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. గ్రామ లైన్‌మన్ అశోక్ ఇకపై ప్రతి రోజూ రాత్రి 9 గంటల వరకు గ్రామంలోనే ఉండి విద్యుత్ కార్యాలయానికి వీడియో కాల్ ద్వారా రిపోర్టు చేయాలని ఏడీఈ ఆదేశించారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు వజ్రపు వెంకట నర్సింహామూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

21న యోగాంధ్ర విజయవంతం చేయాలి

చోడవరం, అమలాపురం ఎమ్మెల్యేలు రాజు, ఆనందరావు


సమావేశంలో మాట్లాడుతున్న చోడవరం, అమలాపురం ఎమ్మెల్యేలు రాజు, ఆనందరావు

చోడవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత కూటమి నేతలు, కార్యకర్తలపై ఉందని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, నియోజకవర్గం ఇన్‌చార్జి, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మంగళవారం యోగాంధ్రపై స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమానికి శిక్షణ పొందిన వారు హాజరయ్యేలా చూడాలని కోరారు. సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పి. చంద్రమౌళి, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు పాల్గొన్నారు.

భార్యను గాయపరిచిన భర్త అరెస్టు

దేవరాపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాలి వీధిలో నిద్రిస్తున్న భార్యను గాయపర్చి పరారైన కోన రామును మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు. ఈనెల 13వ తేదీన భార్య కోన దేవిని కత్తితో ఎడమకాలు, చేయి, మెడ, బొటన వేలు తెగి పడేనంత గాయపర్చి రాము పరారయ్యాడు. మంగళవారం స్థానిక జగనన్న కాలనీ వద్ద పట్టుకొని చోడవరం కోర్టుకు తరలించామన్నారు.

పారిశుధ్య కార్మికులకు యోగా శిక్షణ

బుచ్చెయ్యపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం వడ్డాది పంచాయతీ కార్యాలయం వద్ద మంగళాపురం, వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులతో యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు ఈశ్వరరావు, బాలన్న పాల్గొన్నారు.

బి.కింతాడలో పుస్తకాలు పంపిణీ

దేవరాపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడ, తిమిరాం గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సర్పంచులు బాబూరావు, రెడ్డి సూర్యనారాయణ మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సింహాద్రప్పడు, సాంబమూర్తి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులోకి వరి విత్తనాలు

మాడుగుల రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుకు వరి విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని మండల వ్యవసాయాధికారి అనసూయ తెలిపారు. సోనామసూరి, సాంబమసూరి, శ్రీకాకుళం సన్నాలు, అమర, ఇంద్ర, ఆర్‌జీఎల్, ఎంటీయూ 1262, ఎంటీయూ 1224, ఎంటీయూ 1318 వంటి వరి వంగడాలనుఅందిస్తామన్నారు. విత్తనాలు అవసరమయ్యే రైతులు ఆధార్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

పొట్టిదొరపాలెంలో ఉచిత వైద్య శిబిరం

బుచ్చెయ్యపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిదొరపాలెంలో నల్లమారమ్మ పండుగ సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఈసీజీ, రక్త పరీక్షలు చేశారు. విశాఖ ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి వైద్యులు పరమేశ్వరరావు, హరికిషోర్, సుజిత్ కుమార్, సౌమ్య, హేమంత్, సుజాత రోగులకు పరీక్షలు చేశారు. వీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వడ్డి సత్యారావు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

వడ్డాది పూర్వ విద్యార్థుల వితరణ

బుచ్చెయ్యపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం వడ్డాది హైస్కూల్‌లో 2000-01 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. తమతో చదువుకున్న ఇద్దరి ఆర్థిక పరిస్థితి బాగో లేకపోవడంతో వారికి రూ. 25 వేలు చొప్పున మంగళవారం అందజేశారు. అవసరమైతే భవిష్యత్తులో కూడా మరింత ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పెదనందిపల్లి మాజీ సర్పంచ్ మృతి

దేవరాపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనందిపల్లి మాజీ సర్పంచ్ రొంగలి నారాయణమూర్తి మృతి చెందారు. మంగళవారం ఆయన మృతదేహాన్ని మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంగళవారం నారాయణమూర్తి అంత్యక్రియలు పెదనందిపల్లిలో జరిగాయి.

తహశీల్దార్‌గా భుజంగరావు బాధ్యతల స్వీకారం



కె.కోటపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల తహశీల్దార్‌గా ఎం. భుజంగరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గత కొన్ని నెలలుగా తహశీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. డిప్యూటీ తహశీల్దార్ రమేష్‌బాబు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం తహశీల్దార్ ములగాడ నుంచి బదిలీపై వచ్చారు.

కుక్కకాటుకు ఐదు మేకలు మృతి

చీడికాడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడి చేయడంతో చీడికాడ గ్రామానికి చెందిన చినబోయిన పాలకు చెందిన ఐదు మేకలు, రెండు నాటుకోళ్లు సోమవారం అర్ధరాత్రి మృతి చెందాయి. మంగళవారం ఉదయం కాపరి పాల కుటుంబ సభ్యులు చూసేసరికి మృతిచెంది ఉన్నాయని వారు తెలిపారు. తమకు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

బాబోయ్ బీఎన్ రోడ్డు!

» అడుగడుగునా గోతులతో జనం బెంబేలు
» ప్రమాదకరంగా తయారైన ప్రయాణం


చోడవరం మండలం అంభేరుపురం వద్ద ప్రమాదకరంగా మారిన గోతులు


గోవాడ షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డుమొత్తం ఛిద్రమైన దృశ్యం

చోడవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన రహదారుల్లో ఒకటైన భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు చోడవరం నియోజకవర్గం పరిధిలో అత్యంత దారుణంగా తయారైంది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డు నిర్వహణ, అభివృద్ధి విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల పరిధిలో పలుచోట్ల రహదారి మొత్తం ఛిద్రమై, భారీ గోతులు ఏర్పడిన విషయం తెలిసిందే. నాలుగేళ్ల క్రితం ఎన్‌డీబీ నిధులతో అభివృద్ధి, విస్తరణ పనుల కోసం అప్పటి ప్రభుత్వం టెండర్లు పిలిచింది. అందరికన్నా తక్కువ రేటుకు కోట్ చేసిన కాంట్రాక్టర్ రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులు, కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రూ.10 కోట్ల విలువ చేసే పనులు పూర్తయిన తరువాత బిల్లులు అప్‌లోడ్ చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం మొబిలైజేషన్ నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ఏడాది ఎన్నికల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. మరోవైపు నిర్వహణ పనులు (రోడ్డుపై ఏర్పడిన గోతులు పూడ్చడం, ఇరువైపులా తుప్పలు నరకడం) చేపట్టకపోవడంతో రహదారిపై ఏటేటా గోతులు మరింత అధికం అయ్యాయి. వర్షం కురిసినప్పుడు నీరు నిలిచిపోయి, వాహనాల రాకపోకలతో మరింత పెద్దవిగా తయారవుతున్నాయి. పలుచోట్ల రోడ్డు మొత్తం ధ్వంసమై, వర్షం నీటితో పంట కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణ సమయం రెట్టింపు అవుతుండడంతోపాటు వాహనాలు పాడైపోతున్నాయని వాపోతున్నారు. జిల్లాలో ఇతర రహదారులను అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వం.. బీఎన్ రోడ్డు గురించి ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని నియోజకవర్గం ప్రజలు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. రోడ్డు అభివృద్ధి అటుంచి.. కనీసం గుంతలు అయినా పటిష్ఠంగా పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


గోవాడ- అంభేరుపురం మధ్య గోతులతో వాహనదారుల అవస్థలు


చోడవరం-వడ్డాది మధ్య లక్ష్మీపురం కల్లాల సమీపంలో రోడ్డు మొత్తం విస్తరించిన గొయ్యి

ప్రభుత్వ భూమిని కాపాడండి

» అధికారులకు పెదపల్లి గ్రామస్థుల వినతి



ప్రభుత్వ భూమి వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ఎలమంచిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని పెదపల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, గ్రామానికి సమీపంలో ఉన్న చెరువు భూమిలో కొంత ఆక్రమణకు గురైందని, 2005వ సంవత్సరం నుంచి వివాదం కొనసాగుతున్నదని, ప్రస్తుతం ఇది కోర్టు పరిధిలో వుందని చెప్పారు. కోట్లాది రూపాయల విలువ చేసే చెరువు స్థలం ఆక్రమణదారుల పరం కాకుండా న్యాయపరంగా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బొద్దపు రమణ, కోడిగుడ్డు రమణబాబు, దాసరి కుమార్, బొద్దపు శ్రీను, బొద్దపు నాగేశ్వరావు, స్వామి, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

» జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు


డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సబ్బవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాధికారి మోహన్‌రావు అన్నారు. మండలంలోని నారపాడు, అమృతపురం గ్రామాల్లో మంగళవారం 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథ కాలు, భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. జిల్లా ఉద్యాన శాక అధికారి ప్రభాకరరావు... ఉద్యానపంటలకు సంబంధించి ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు గురించి వివరించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం.రాజ్‌కుమార్.. పంటలకు నష్టం కలిగించే పురుగులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి విశదీకరించారు. సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ, వరిలో ఎంటీయూ-1224, ఎంటీయూ-1262, బీపీటీ-2295, బీపీటీ -2846, ఎంటీయూ-1318 రకాలు అధిక దిగుబడులు ఇస్తాయని చెప్పారు. శాస్త్రవేత్తలు ఎం.వెంకటేశం, టి.కిరణ్.. ఎరువులు యాజమాన్యం, డ్రోన్లతో ఎరువులు చల్లడం, పురుగు మందులు పిచికారీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎం.సత్తిబాబు, ఎ.సౌజన్య, కిశోర్‌కుమార్, ఏవో పోతల సత్యనారాయణ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు

» ఆర్డీ కార్యాలయ పరిధిలో 350 మందికి స్థానచలనం

విశాఖపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రాంతీయ కార్యాలయ పరిధిలో తొలిరోజు మొత్తం 12 కేడర్లకు చెందిన 350 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఇందులో సుమారు 200 మంది స్టాఫ్ నర్సులు, 60 మంది హెడ్ నర్సులతోపాటు డిప్యూటీ డెమోలు, నర్సింగ్ సూపరింటెండెంట్లు, పీహెచ్‌ఎన్ (టీచింగ్), సీనియర్ ఫార్మసిస్టు వంటి కేడర్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారు. ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులందరికీ స్థానచలనం కల్పించారు. ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్‌ను ఆర్డీ డాక్టర్ రాధారాణి, డీడీ శ్రీనివాస్‌కుమార్, ఇతర సిబ్బంది నిర్వహించారు.

నేడు రేవుపోలవరం తీరంలో యోగా

» హాజరుకానున్న మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్


రేవుపోలవరం సముద్రతీరం వద్ద యోగా నిర్వహణకు మంగళవారం రాత్రి జరుగుతున్న ఏర్పాట్లు

ఎస్.రాయవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా మండలంలోని రేవుపోలవరం సముద్రతీరం వద్ద బుధవారం ఉదయం సుమారు రెండు వేల మందితో యోగ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ జె.రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం డీఆర్‌డీఏ పీడీ శచీదేవితో కలిసి రేవుపోలవరం తీరంలో యోగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక్కడ నిర్వహించే యోగ కార్యక్రమానికి మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఉద్యోగులు, కూటమి పార్టీల శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, సీనియర్ నాయకులు ఎన్.వెంకటరాజు, గుర్రం రామకృష్ణ, ఏపీవో ఎరకయ్య, ఏపీఎం శివప్రసాద్, తదితరులు వున్నారు.

యోగాంధ్రలో కళాశాల విద్యార్థులు

» మూడు రోజులపాటు శిక్షణ


యోగాసనాల్లో శిక్షణ పొందుతున్న నక్కపల్లి జూనియర్ కళాశాల విద్యార్థులు

నక్కపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సకల ఏర్పాట్లు చేస్తున్నది. ఆ రోజు ఉదయం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సహా దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఒకే ఆసనాలు వేసేలా ఆయుష్ శాఖ కామన్ యోగా ప్రొటోకాల్ (సీవైపీ)ని రూపొందించింది. ఇందులో భాగంగా నెల రోజుల ముందు నుంచే వాడవాడలా ప్రొటోకాల్ యోగా శిక్షణ జరుగుతున్నది. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేయడానికి కళాశాలల విద్యార్థులకు మూడు రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కామన్ యోగా ప్రొటోకాల్‌పై మంగళవారం శిక్షణ ప్రారంభించారు. 19వ తేదీ వరకు వీరికి ఆయా ప్రాంతాల్లో యోగా గురువులు, యోగా మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందిన విద్యార్థులు ఈ నె 21వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటలకు విశాఖలో వారికి కేటాయించిన ప్రదేశాల వద్ద హాజరయ్యేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఆయా కళాశాలలకు ఈ నెల 20వ తేదీ రాత్రికే బస్సులు చేరుకుంటాయి. మరోసటి రోజు తెల్లవారుజామున విద్యార్థులను ఎక్కించుకుని విశాఖకు బయలుదేరతాయి. తాగునీరు, అల్పాహారం, యోగా మ్యాట్‌లు, ఇతర వస్తులను సమకూర్చుతారు.

'సాయి శ్రేయాస్'కు షాక్

... 5వ పేజీ తరువాయి

పనులు చేస్తున్నారు.

- ప్రతి మందును బ్యాచ్‌ల వారీగా తయారుచేసి బయటకు పంపుతారు. అవన్నీ సక్రమంగా ఉన్నాయని నిపుణులు సర్టిపై చేయాలి. కానీ అర్హత లేనివారితో ఈ పనులన్నీ చేయిస్తున్నారు.
- కంపెనీలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ) ఏదీ అమలు చేయడం లేదు. దేనికీ సరైన రికార్డులు లేవు.
- ప్రాసెసింగ్ ప్రక్రియలో పాల్గొన్న వారికి సరైన భద్రతా పరికరాలు లేవు.
- ప్రమాదం జరిగినప్పుడు ఈటీపీతో అనుసంధానమైన స్క్రబ్బర్ స్విచ్ ఆన్ చేయలేదని గుర్తించారు.
- ఏ మందు తయారీలో ఏ వ్యర్థాలు ఎంత పరిమాణంలో వస్తాయో సంస్థ వద్ద అంచనాలు లేవు. ముందస్తు జాగ్రత్తల కోసం తీసుకోవలసిన ప్రణాళిక లేదు. ఇవన్నీ పరిశీలించిన డ్రగ్ కంట్రోల్ అథారిటీ ఉత్పత్తుల తయారీ నిలిపివేయాలని ఆదేశించింది.

పరిమితికి మించి వీఓసీ

గది ఉష్ణోగ్రత వద్ద గాలిలో కలిసిపోయే వ్యర్థాలను 'ఓలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్' (వీఓసీ)గా వ్యవహరిస్తారు. ఎక్కడైనా విషవాయువులు గాలిలో కలిసినట్టు తెలిసినా, వాసన వచ్చినా వీఓసీని పరికరాల ద్వారా కొలుస్తారు. సాయి శ్రేయాస్‌లో హెచ్2ఎస్ విడుదలై ఇద్దరు చనిపోయిన తరువాత కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మరుసటిరోజు వెళ్లి వీఓసీని నమోదు చేశారు. ఈటీపీ, స్టోరేజీ ట్యాంకు, ప్లాంటు లోపల 107-114 పీపీఎం ఉన్నట్టు నమోదైంది. ఇది చాలా..చాలా ప్రమాదకర స్థాయి. భరించలేని దుర్గంధం వస్తుంది. ఆ స్థాయిలో హెచ్2ఎస్ విడుదలై పర్యావరణానికి హాని కలుగజేసినందున ఇకపై ఉత్పత్తులు చేయకూడదని ఏపీపీసీబీ ఆదేశించింది.

సరుగుడు సాగుకు మొగ్గు

... 5వ పేజీ తరువాయి

రైతులు సంతృప్తికరమైన ఆదాయం పొందుతుండడంతో చెరకు, వరి సాగుచేసే రైతులు ఈ పంటలకు స్వస్తిపలికి సరుగుడు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో మెట్ట, బంజరు భూములు, గరప నేలల్లో మాత్రమే సరుగుడు తోటలు సాగు చేసేవారు. కొన్నేళ్ల నుంచి వరి, చెరకు సాగు చేసే పల్లం , నల్లరేగడి భూముల్లో కూడా సరుగుడు వేస్తున్నారు. పొలాలను కౌలుకు ఇద్దామంటే ఎవరూ ముందుకు రావడంలేదని, వ్యక్తిగత కారణాల వల్ల చెరకు, వరి వంటి పంటలను తాముసాగు చేసే పరిస్థితి లేదని, ఇటువంటి తరుణంలో భూములను ఖాళీగా వుంచలేక సరుగుడు నాట్లు వేయిస్తున్నామని పెద్ద కమతాలు వున్న రైతులు చెబుతున్నారు. పలువురు రైతులు సరుగుడు సాగుకు ఆసక్తి చూపుతుండడంతో నారుకు డిమాండ్ పెరిగింది. ట్రేలలో పెంచిన హైబ్రిడ్ నారు మొక్కలు ఒక్కొక్కటి రూ.2కు నర్సరీల నిర్వాహకులు విక్రయిస్తున్నారు. సాధారణ నారు అయితే ఒక్కో మొక్క రూపాయికి అమ్ముతున్నారు. ఎకరాకు 4-5 వేల మొక్కలు వేస్తున్నారు. ఐదేళ్ల తరువాత 50 టన్నులకు తగ్గకుండా దిగుబడి వస్తుందని, అప్పటి ధరనుబట్టి ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.

ఫార్మా వ్యర్థాల కాలుష్యంతో మత్స్య సంపదకు ముప్పు

... 5వ పేజీ తరువాయి

పంపుతామని, వారం రోజుల్లో నివేదిక వస్తుందని, ఏ కారణంగా చేపలు చనిపోయాయో అప్పుడు తెలుస్తుందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు ఉమ్మిడి జగన్, దూడ మసేను, శ్రీను, మల్లికార్జున పోలయ్య, జగదీశ్, కాసుబాబు మాట్లాడుతూ.. సెజ్‌లోని కొన్ని ఫార్మా కంపెనీల్లో రసాయన వ్యర్థాలను శుద్ధి చేయకుండా నేరుగా ఉప్పుటేరులోకి వదిలేయడం వల్లనే చేపలు చనిపోతున్నాయని ఆరోపించారు. ఇది తరచూ జరుగుతున్నదని, ఏపీపీసీబీ, మత్స్యశాఖతోపాటు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

కాల్పుల కలకలం

... 5వ పేజీ తరువాయి

దేముళ్లు, తన వద్ద వున్న నాటు తుపాకీతో రాముపై కాల్పులు జరిపారు. దీంతో రాము తీవ్రంగా గాయపడి కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చోడవరంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కె.కోటపాడు సీఐ పైడంనాయుడు, ఇన్‌చార్జి ఎస్ఐ నారాయణరావు, పోలీస్ సిబ్బంది మంగళవారం సాయంత్రం సంఘటనా స్థలానికి వెళ్లారు. పలువురిని విచారించిన అనంతరం చోడవరం వెళ్లి, రాము మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. నిందితుడు దేముళ్లు పరారీలో ఉన్నట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. అయితే ఈ ఘటనపై కుటుంబ సభ్యుల నుంచి ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదుచేసి నిందితుడిని పట్టుకుంటామని ఆయన తెలిపారు.

క్రైం... crime news

ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి పట్టణంలోని వేల్పులవీధి, పూడిమడకరోడ్డులో ఇటీవల రెండు ద్విచక్ర వాహనాలు చోరీ అయ్యా యి. పరవాడలో నివాసం ఉం టున్న చీడికాడ గ్రామానికి చెందిన మాకాల ధనుకుమార్ ఈ వాహ నాలను చోరీ చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇతని కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు సోమవారం సాయంత్రం తుమ్మపాల సమీపంలోని ఏలేరు కాలువ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం : నలుగురి అరెస్టు

మాడుగుల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గరికబంద చెక్‌పోస్టు వద్ద మంగళవారం మధ్యాహ్నం పోలీసులు ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి మాడుగుల ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా బేతంచర్ల ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు అరకు ప్రాంతంలో ఆరు కిలోల గంజాయి కొనుగోలు చేశారు. వ్యాన్‌లో వారు పాడేరు ఘాట్ మార్గం గుండా మైదాన ప్రాంతానికి వస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు గరికబంద చెక్‌పోస్టు వద్ద వ్యాన్‌ను ఆపి తనిఖీ చేశారు. ఆరు కిలోల గంజాయి లభ్యం కావడంతో దానిని స్వాధీనం చేసుకుని ఆ నలుగురిని అరెస్టు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


మృతురాలు పాలమ్మ (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బిడి గ్రామానికి చెందిన మహిళ చెన్నైలో రోడ్డు ప్రమాదానికి గురై అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. దీనికి సంబంధించి ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. దిబ్బిడి గ్రామానికి చెందిన పడాల పాలమ్మ(38)కు పదిహేను సంవత్సరాల క్రితం నీలకంఠపురానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వీరికి యమున అనే కుమార్తె ఉంది. అయితే మనస్పర్థల కారణంగా భార్యాభర్తలు విడిపోయారు. కాగా కూలి పనుల కోసం పాలమ్మ ఇటీవల చెన్నై వెళ్లింది. ఈ నెల 3న పని ముగించుకుని వస్తుండగా ఆమెను కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను అక్కడ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమె మృతితో దిబ్బిడి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి


వెంకటరమణ (ఫైల్ ఫొటో)

పాయకరావుపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోటవురట్ల మండలం జల్లూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి, కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలో రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. కోటవురట్ల మండలం జల్లూరు గ్రామానికి చెందిన కొడకల వెంకటరమణ(51) కుటుంబంతో సహా సుమారు 15 ఏళ్ల క్రితం తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి వలస వెళ్లాడు. అక్కడ ఒక కోళ్లఫారంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలో వున్న తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆమెను చూసేందుకు సోమవారం మధ్యాహ్నం అనపర్తిలో సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. అన్నవరం-రావికంపాడు స్టేషన్ల మధ్య పి.చిన్నయ్యపాలెం రైల్వే గేటు వద్ద ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న తుని రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వెంకటరమణను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో తుని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య కేసులో అత్తమామల అరెస్టు

మునగపాక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాదేవిపేటలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న కేసుకు సంబంధించి ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. బత్తిన పైడికుమారి సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతురాలి తల్లి నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్తమామలు వరలక్ష్మి, పోతురాజులపై కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా రిక్షా కార్మికుడి మృతి

ఎలమంచిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ వెనుక భాగంలోని తుప్పల్లో రిక్షా కార్మికుడు అనుమానాస్పద స్థితిలో నిర్జీవంగా కనిపించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పరమేశ్వరి థియేటర్ ప్రాంతానికి చెందిన చేపల సన్యాసిరావు(60) రిక్షా తొక్కుతూ, వచ్చే ఆదాయంతో జీవిస్తున్నాడు. ఇతను కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య లక్ష్మి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం రైల్వే స్టేషన్ వెనుక భాగంలోని తుప్పల్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో అటుగా వెళుతున్న వ్యక్తుల పరిశీలించగా మృతదేహం కుళ్లిపోయి వుంది. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి పరిశీలించారు. స్థానికులను వాకబు చేయగా.. ఐదు రోజుల క్రితం నుంచి కనిపించకుండా పోయిన రిక్షా కార్మికుడు సన్యాసిరావు గురించి చెప్పారు. అతని భార్యను రప్పించి మృతదేహాన్ని పరిశీలింపజేశారు. అతను ధరించిన చొక్కాను గుర్తుపట్టి మృతిచెందింది తన భర్త సన్యాసిరావేనని చెప్పింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సావిత్రి తెలిపారు.

నర్సీపట్నం ఏఎంసీకి కొత్త పాలకవర్గం

... 5వ పేజీ తరువాయి

దృష్టి పెడతానని, ఏఎంసీ పరిధిలో కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. మెయిన్ రోడ్డు వైపు దుకాణ సముదాయం నిర్మించడం ద్వారా ఏఎంసీకి ఆదాయం వస్తుందని చెప్పారు. మట్టి నమూనా పరీక్షా కేంద్రాన్ని పునఃప్రారంభిస్తామని, పండ్లు మగ్గపెట్టుకునే రిఫైనింగ్ యూనిట్‌ను బాగు చేయించి వినియోగంలోకి తెస్తానని ఆయన తెలిపారు.

విశాఖలో యోగాకు 60 వేల మంది

... 5వ పేజీ తరువాయి

దినోత్సవానికి అనకాపల్లి జిల్లా నుంచి బస్సులు వెళ్లేందుకు రెండు రూట్‌లను కేటాయించామన్నారు. ఒకటి సబ్బవరం, పెందుర్తి మీదుగా, రెండోది గాజువాక, ఎన్ఏడీ జంక్షన్ మీదుగా బీచ్ రోడ్డుకు వెళ్లేలా రూట్ మ్యాప్ రూపొందించామని తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, బండారు సత్యనారాయణమూర్తి, కేఎస్ఎన్ఎస్ రాజు, కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద సత్యనారాయణ, ప్రగడ నాగేశ్వరరావు, మళ్ల సురేంద్ర, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	77.00
లైవ్ ధర	97.00
విత్ స్కిన్	164.00
స్కిన్ లెస్	174.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554